సంపుటి 13 సంచిక 6 నవంబర్ - డిశంబర్ 2025

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

honeybee.org
Vol-13 Issue-6
వెల : రూ. 20/-






## ఆంధ్రప్రదేశ్ లోని మంగళగిరి (అమరావతి)లో డిశంబర్ 30న జరిగిన

# “గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్స్ సమ్మిట్”

## లో “పల్లెసృజన” బృందం పాల్గొన్న దృశ్యాలు



























Vol-13, Issue - 6 November - December 2025

# విషయ సూచిక

సంపుటి-13 సంచిక - 6 నవంబర్ - డిశంబర్ 2025

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-49253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**డా. కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

## ఈ సంచికలో.....

* 20 వసంతాల "పల్లెసృజన పండుగ" - 4
* రైతుల కోసం 'పద్మశ్రీ' చింతల వెంకట్ రెడ్డి నూతన ఇన్నోవేషన్లు - 11
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 14
* ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన 'పల్లెసృజన' ఇన్నోవేషన్లు-ఇన్నోవేటర్లు- 18
* 'పల్లెసృజన' 55వ "చిన్నశోధయాత్ర - యాత్రీకుల అనుభవాలు - 20
* గ్రామీణ రవాణా కొరకు 2 రకాల మొటార్ సైకిల్ ట్రాలీలు తయారు చేసిన మహిపాల్ చారి - 25
* ఎన్ఐఎఫ్ వారి 'పీపుల్స్ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ 2వ ఉత్సవాలు - కొత్త ఢిల్లీ లో వెలుగులోకి వచ్చిన నూతన ఇన్నోవేషన్‌లు - 27
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 30
* స్పందన - 32

**కవర్ లోపలి పేజీల్లో ...**

మంగళగిరి ఆర్‌టిఐహెచ్ వారి "గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్ సమ్మిట్" కార్యక్రమంలో 'పల్లెసృజన' పాల్గొన్న చిత్రాలు,

**మధ్య పేజీలో :**

నవంబర్ - డిశంబర్ 2025 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# గ్రామీణ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లను అర్థం చేసుకోవాలి

30 డిశంబర్, 2025న మంగళగిరి, ఆంధ్రప్రదేశ్ లో ఒక వినూత్న సమావేశం జరిగింది. పల్లెసృజన మరియు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టిఐహెచ్) ఆధ్వర్యంలో 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్స్ సమ్మిట్' నిర్వహించడం జరిగింది. ఆర్‌టిఐహెచ్ ప్రాంగణంలో 35 మంది ఇన్నోవేటర్లు, సహాయ సంస్థలు, పల్లెసృజన వాలంటీర్లు రోజంతా చర్చలతో గడిపారు. ఇన్నోవేషన్లను చూడటం, ఇన్నోవేటర్లతో చర్చలు జరపడం ఆనందకరంగా జరిగింది. ఈ సమావేశం తప్పకుండా ఆర్‌టిఐహెచ్ వారికి, గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లకు పరస్పర అవగాహనకు దారి తీసిందని భావిస్తున్నాము.

పల్లెసృజన గత 20 సంవత్సరాల్లో వ్యవస్థకు, ప్రైవేటు సంస్థలకు, విద్యా వ్యవస్థకు, గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్ల ప్రత్యేకతను, విశిష్టతలకు అవగతం చేయడానికి ఎంతగానో కృషి చేస్తూ వచ్చింది. ఈ సమావేశంలో వక్తలందరూ పల్లెసృజన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ల అభివృద్ధికై చేసిన కార్యక్రమాలను ప్రస్తావిస్తూ వాటిని మరింత వ్యవస్థాగతం చేయాలన్న అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. కొన్ని ప్రధాన అంశాలను ఈ సందర్భంలో చర్చించుకుందాం.

పల్లెసృజన వాలంటీర్లు రోజంతా గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లకు తోడుగా ఉంటూ, ఇన్నోవేషన్ల ప్రదర్శనకు పూర్తి సహకారం ఇస్తూ శాయశక్తులా ఇన్నోవేటర్లను, ప్రైవేటు ఇన్వెస్టర్స్, ప్రైవేట్ కంపెనీలు, ఆర్‌టిఐహెచ్ సిబ్బందితో సంధానం చేయడానికి కృషి చేసారు. కొంతవరకు విజయం సాధించ గలిగారు.

ఆర్‌టిఐహెచ్ సిబ్బంది రోజంతా ఇన్నోవేటర్ల మాటలు విన్నారు. ఇన్నోవేషన్లు చూశారు. పల్లెసృజన మాటలను, వారి భవిష్యత్తు కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. ఆర్‌టిఐహెచ్ సిఇవో ధాత్రిరెడ్డి తక్కువ సమయం మాత్రమే ఈ సమావేశంలో ఉన్నారు. ఇన్నోవేటర్స్ అందరినీ కలవలేక పోవడంతో వారు నిరాశగా ఉండిపోయారు. మిగతా సిబ్బందికీ తెలుగు భాష పరిచయం లేక పోవడం వల్ల సంభాషణలు అంత సంపూర్తిగా జరగలేదు.

ప్రైవేటు కంపెనీలు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు ఎలా ముందుకు తీసుకెళ్ళాలో, వాటికి ఎలాంటి సహాయాలు వారు ఇవ్వగలరో చర్చించారు. అయితే వారందరికి గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ల గురించి క్షుణ్ణంగా తెలియదు. వారే స్వయంగా తాము గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను ఇంతవరకు మార్కెట్‌లోకి తేలేదని ఒప్పుకున్నారు. పల్లెసృజన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లకు ఒక నిర్వచనం ఇచ్చింది. ఇన్నోవేటర్లు గ్రామ సమస్యలకై, గ్రామ వనరులతో, గ్రామాల్లోనే పరిష్కారాలు తయారు చేస్తారో వాటిని 'గ్రామీణ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు"గా పరిగణించాలని పల్లెసృజన వక్కాణించింది. అయితే వ్యవస్థ - ప్రభుత్వం లేక ప్రైవేటు - ఇంతవరకు పట్టణాలలోనే ఎక్కువగా పని చేసింది కానీ గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో ఇలాంటి ఇన్నోవేషన్లపై ఏ పని చేయలేదని, ఎలాంటి అనుభవం లేదని స్పష్టంగా చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామీణ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ల అభివృద్ధి చాలా క్లిష్టంగా ఉంటుంది.

పైన చెప్పిన గ్రామీణ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ల నిర్వచనం వ్యవస్థ ప్రస్తుతం మరోలా



చేస్తుంది. ఎవరైతే గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరిస్తారో వారిని గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లుగా పరిగణిస్తుంది. ఇది సరికాదు. సమస్యలు గ్రాస్‌రూట్స్ అయినా గ్రామ ఇన్నోవేటర్లు వ్యవస్థలోని పరిశోధన శాలలు, ఇంతవరకు కళాశాలలు, చిన్న, సన్నకారు పరిశ్రమలకు దూరంగా ఏకరువు, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక స్థోమత, కుటుంబ సహకారం లేకుండా సమాజ ఎగతాళిని భరిస్తూ ఆవిష్కరణలు సాధిస్తారు. ఈ రెండు రకాల ఇన్నోవేటర్లను ఒకే కేటగిరిలో కాకుండా విడివిడిగా పరిగణించాల్సిన అవసరం ఉంది. అలా చేయకపోతే గ్రామీణ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లకు అన్యాయం జరుగుతుంది. వీరంతా గ్రామాల్లో ఉంటారు, వ్యవస్థ తెలీదు, కాని వారి పరిష్కారాలు, వారి క్రియాశీలత ఎంతో ఉన్నత స్థాయిలో ఉంటుంది. ఈ జ్ఞానాన్ని వెతికి, వెలికి తీసి సమాజానికి సమాఖాంతరంగా అందించడం వ్యవస్థ బాధ్యత. ముఖ్యంగా ఆర్‌టిఐహెచ్ - ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టితో స్థాపించబడిన సంస్థపై సంపూర్తిగా ఉంటుంది. అవగాహనా లోపాన్ని పూర్తి చేస్తే కాని గ్రామీణ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్‌లకు న్యాయం జరగదు.

పల్లెసృజన 20 యేళ్ళ గ్రామీణ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ పరిచయాలలో అర్థమైన కొన్ని విషయాలు ఇప్పుడు చర్చించుకుందా. వారిని మనం వెతకాలి, వాళ్ళతో చర్చలు, సంభాషణలు వాళ్ళ భాషలోనే జరగాలి. వ్యవస్థ వారిని పట్టణాలకు పిలవకుండా, వారి గ్రామాలకు వెళ్ళి కలవాలి. వారికి సంపూర్తిగా గౌరవం ఇవ్వాలి. వారి జ్ఞాన హక్కులను, అధికారాలను సంపూర్తిగా వారికి చెందేట్లు చూడాలి. బధ్యతాయుతంగా గ్రామీణ ఇన్నోవేషన్లకు వెలికి తెచ్చి, వాటిని అవసరమున్న సమాజానికి, ప్రజలకు అందజేసేలాగా అన్ని ప్రణాళికలు, తగిన సహాయ వ్యవస్థ రూపొందించాలి. వారికి కావలసింది బిజినెస్ మోడల్ కాదు. ఆర్థిక సహాయం. మార్కెట్ కాదు, ప్రభుత్వ పరంగా వాటిని ఇతర గ్రామాలకు అందించడం. టెక్నాలజీ మెంటరింగ్ కాదు, వారి ఆవిష్కరణ సాధించే ప్రయాణంలో వచ్చిన సాంకేతిక అవరోధాలను తొలగించడం.

గ్రామీణ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు చాలా ఉపయోగకరమైనవి. ఇవి రైతుల పెట్టుబడిని తగ్గిస్తాయి, సమయాన్ని, శ్రమను మిగిలిస్తాయి. ఉత్పాదకతను పెంచుతాయి. వ్యవసాయం అంటే నష్టపోయే పరిశ్రమగా కాక లాభకరం చేస్తాయి. వ్యవసాయం, గ్రామీణ జీవిత మనుగడలకు ప్రాణాలు పోస్తాయి. ఎక్కువ గ్రామీణులను ఊళ్ళలోనే ఉంచి, వలసలను తగ్గిస్తాయి. ఇలాంటి అతి ప్రభావం కల గ్రామీణ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను చాలా శ్రద్ధగా, గౌరవంగా ప్రోత్సహిస్తూ వారికి కావలసింది ఇవ్వాలి - మనకు చేతనయింది కాదు. అప్పుడే గ్రామీణ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లు అభివృద్ధి చెందుతారు. మరిన్ని ఇన్నోవేషన్లకు ప్రోత్సాహం లభిస్తుంది. గ్రామ ప్రజలు అభివృద్ధి పద్ధతుల్లో ముందుకు సాగాలంటే ఈ పల్లె జ్ఞానాన్ని, దాని ప్రాధాన్యతను వ్యవస్థ త్వరలో గుర్తిస్తుందని, గ్రామీణ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను ఒక ప్రత్యేక కేటగిరిలో పరిగణిస్తుందని ఆశిద్దాం.

నూతన సంవత్సరం మీ కుటుంబాలకు, మీ గ్రామాలకు ఆనందం, అభివృద్ధి ప్రసాదించాలని మనసారా కోరుకుంటూ....

భవదీయ
బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

**"పల్లెసృజన విశ్వాసం"**

❖ రైతులు గ్రాహకులు కాదు సమకూర్చేవారు (ప్రొవైడర్స్) ❖ ఊళ్ళు అంతులేని బావులు కాదు - అవి ఆధారాలు (సోర్స్)

# 20 వసంతాల 'పల్లెసృజన పండుగ'



–జమ్మలమడక శశిమోహన్

2025 డిశంబర్ 6–7తేదీలలో హైదరాబాద్ లోని తార్నాక ప్రాంతంలో వున్న 'సత్యోదయం రీట్రీట్ సెంటర్'లో "పల్లెసృజన" తన 20 సంవత్సరాల ఫలవంతమైన ప్రయాణం పూర్తి చేసుకున్న సందర్భంగా పల్లెసృజన ఇన్నోవేటర్లు, శ్రేయోభిషులతో, స్వచ్ఛంద కార్యకర్తలతో కలిసి "20 సంవత్సరాల పల్లెసృజన కుటుంబ పండుగ" సమావేశం ఆనందోత్సాహాలతో జరుపుకుంది. ఈ సమావేశంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి ఇన్నోవేటర్లు అనేక మంది శ్రేయోభిలాషులు ప్రత్యక్షంగానే కాక, ఆన్‌లైన్‌లో కూడా పాల్గొనడం జరిగింది.

ముందుగా పల్లెసృజనపై అంజయ్య వ్రాసి, గానం చేసిన గీతాన్ని అందరూ ఆనందంగా విన్నారు. సమావేశ ఉద్దేశ్యాలను, సమావేశం జరుపుతున్న కారణాలను విశదీకరిస్తూ స్వాగత వచనాల తర్వాత ఎన్ఐఎఫ్‌కు చెందిన డా. అరవింద్ గారు ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ పల్లెసృజన 20 సంవత్సరా లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ మన దేశంలోని పల్లెలలో అపారమైన జ్ఞాన సంపద ఉన్నదని, దాన్ని వెలుగులోకి తీసి సామాన్య జనులకు అందుబాటులోకి తీసుకు రావటం లో పల్లెసృజన చేస్తున్న కృషి అపారమని, గాంధీగారు కలలుగన్నట్లుగా ప్రస్తుతం దేశ ప్రణాళికలలో వికసిత భారత్ సాధించుకునే దిశగా పల్లె సృజన చిన్న అడుగులు వేసినా, సరైన మార్గంలోనే దేశానికి దిశా నిర్దేశం చేస్తున్నదని ఇదేవిధంగా దేశంలోని సంస్థలన్నీ కలిసి కట్టుగా పని చేస్తే భారత దేశం ఉచ్ఛ దశకి చేరుతుందనటంలో ఎలాంటి సంశయం లేదు.

తర్వాత భారత దేశంలో పునాది స్థాయి ఇన్నోవేటర్ల కల్పతరువైన "హనీబీ నెట్‌వర్క్" వ్యవస్థాపకులు – పల్లెసృజన శ్రేయోభిలాషి ఆచార్య అనిల్ గుప్తా గారు తమ సందేశంలో "తాను పల్లెసృజన ప్రారంభించినప్పటి నుండి దాని ప్రగతిని గమనిస్తున్నానని, హనీబీ చేస్తున్న కార్యక్రమాలను అంతకన్నా సమర్థవంతంగా పల్లెసృజన కొనసాగిస్తోందని, ఉభయ తెలుగు రాష్ట్రాలలో పునాది స్థాయి ఇన్నోవేటర్లను, సాంప్రదాయక జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకు వచ్చి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు, సత్కారాలు వచ్చేలా కృషి చేస్తున్న బ్రిగేడియర్ గణేశం గారిని, అతని సమర్థవంతమైన బృందాన్ని ప్రత్యేకించి గణేశం గారి సతీమణి శ్రీమతి అరుణ గారి చేదోడును గుర్తు తెచ్చుకుని ప్రశంసించారు. చింతకింది మల్లేశం, చింతల వెంకట్ రెడ్డి గారి లాంటి వారికి 'పద్మశ్రీ' పురస్కారం వచ్చింది అంటే దాని వెనక పల్లెసృజనే ముఖ్య కారణమని, ఏదైనా ఒక వ్యవస్థ అభివృద్ధి చెందాలి అంటే "కేరింగ్, షేరింగ్, డేరింగ్" అనే సూత్రాన్ని మర్చిపోకుండా ఇతరుల కష్టాలను అర్థం చేసుకుంటూ మనకున్న జ్ఞానాన్ని, అనుభవాన్ని ఇతరులతో పంచుకుంటూ, సమస్యల











పరిష్కారంలో వెనుకంజ వేయకుండా ధైర్యంగా పూనుకున్నప్పుడే మానవాళి అభ్యున్నతి సాధ్యమై దేశం సుసంపన్నం అవుతుందని దేశ ప్రధాని ఎంతో నమ్మకంగా చెపుతున్న "ఆత్మ నిర్భర్ భారత్" సాధించటానికి గ్రామ స్థాయిలో వున్న అపారమైన జ్ఞాన సంపదను గుర్తించి, దేశాభ్యుదయానికి వాడే దిశగా అందరూ కృషి చేయాలి" అని కోరారు.

తరువాత ఆన్‌లైన్‌లో "యోజక్" సంస్థ అధినేత శ్రీ ప్రొఫెసర్ గజానన్ డాంగే పల్లెసృజన గత 20 సంవత్సరాలలో చేస్తున్న కృషి గురించి చెపుతూ..... భారత దేశం ప్రగతిపథంలో అంత ఉత్సాహంగా ద్విగుణీకృత శక్తితో ముందుకు ఉరుకుతోంది అన్న అంశాన్ని 'పల్లెసృజన' ప్రగతితో పోల్చవచ్చునని, పల్లెసృజన తాను చేసే అన్ని కార్యక్రమాలలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితం వచ్చేలా కృషి చేస్తుంది. పల్లెసృజన, దాని వాలంటీర్లు ఎంత ఉత్సాహంగా, దీక్షతో పని చేస్తున్నా రో గమనించిన తర్వాతనే తాను ఇటువంటి సంస్థలు దేశంలోని ప్రతి రాష్ట్రంలో నెలకొల్పాలని, దేశంలోనే కాదు, ఇతర దేశాలలో కూడా ఉండాలని కోరుకుంటున్నాను. ఆ దిశగా ప్రయత్నాలు కూడా చేస్తున్నానని, పునాది స్థాయి జ్ఞానాన్ని సమాజ శ్రేయస్సుకు వాడినప్పుడే ప్రగతి సాధ్యమౌతుందని అన్నారు.

తరవాత పల్లెసృజన తన ం20 సంవత్సరాల ప్రస్థానంలో కోల్పోయిన తన ఆత్మీయ బంధువులు అయిన డా. కె.ఎల్. రావు, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ, డా. కె.సి. ఛుగ్, 'వనజీవి' దరిపల్లి రామయ్య, శ్రీయుతులు బోయ పెద్ద రాజన్న, విక్రమ్ రాథోడ్, సయ్యద్ సుభాని, లూథర్ పాల్, శ్రీమతి దూబ రాజు, ముళ్ళపూడి సత్యనారాయణ మొదలైన వారిని పల్లెసృజనతో ఉన్న అనుబంధాన్ని, వారు చేసిన సేవను స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు.

తరవాత మొదటితరం ఇన్నోవేటర్లు అయిన దోమల నుండి రక్షణ, ఎటువంటి పుండ్లు, దెబ్బలను అతి త్వరగా నయం చేసేలా శ్రీశైలం, మొక్కలు, చెట్లకు నిమటోడ్స్‌కి మందు, వరిలో కలుపు నివారణ మందులు కనిపెట్టిన గల్లా చంద్రశేఖర్, కొత్తరకం స్ప్రేయర్ తయారు చేసిన ఉప్పుతేళ్ళ కృష్ణ, వరి కోత తర్వాత పొలం దున్నవలసిన అవసరం లేకుండా విత్తనం వేసే గొర్రు తయారు చేసిన గురవయ్య, గాలి ఎటునుండి వీచినా తిరిగి నీటిని తోడే విండ్ మిల్ తయారు చేసిన పఠాన్ సైదా, పోచంపల్లి చేనేత కష్టాలను తీర్చే ఆసు యంత్రం కనిపెట్టి రాష్ట్రపతి పురస్కారం, 'పద్మశ్రీ', 'అమేజింగ్ ఇండిన్' పురస్కారాలతో పాటు అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు పొందిన, తన జీవిత చరిత్ర ఆధారంగా సినిమాగా తీయబడ్డ చింతకింది మల్లేశం, మొట్టమొదటిసారిగా నడుచుకుంటూ పొలంలో కలుపు నివారణ, అంతర సేద్యాలకు ఉపయోగ పడే వీడర్ తయారు చేసిన మహిపాల్ చారి, నీటి పంపు వద్దవెళ్ళి మోటార్ ఆన్ చేయాల్సిన అవసరం లేకుండా ఒక రిమోట్‌ను తయారు చేసిన వెల్లె శ్రీనివాస్, ఆడపిల్లలకు చిన్న వయసులోనే ఎవరు ఎక్కడ స్పర్శిస్తే అది మంచి స్పర్శనా, చెడు స్పర్శనా అని తెలియజేసేలా వారిని జాగ్రత్త పరిచే బొమ్మను తయారు చేసిన యాకర గణేశ్, బావిలో నీళ్ళు అయిపోతే డీజిలుతో నడిచే వాటర్ కూల్ ఇంజన్ దానంతట అదే ఆగేలా చేసిన కొల్లి నాగ శ్రీనివాస్, ఆరోగ్యవంతమైన, పుష్టికరమైన ఆహార పదార్థాలను చిరు ధాన్యాలతో తయారు చేసిన తోకల శ్రీదేవి తదితరులు తమకు 'పల్లెసృజన'తో కల బాంధవ్యాన్ని, అది తమకు ఏవిధంగా జీవితంలో నిలదొక్కుకొని ముందుకు సాగటానికి దోహద పడిందో గుర్తు చేసుకొని కృతజ్ఞతలు తెలిపారు.

తరువాత పల్లెసృజన తొలి రోజుల నుండి దాని కార్యకలాపాలలో చురుకుగా పాల్గొని, ప్రస్తుతం అమెరికాలో ఉంటూ కూడా అనేక మంది ఇన్నోవేటర్లకు ఆర్థిక సహాయం అందిస్తున్న సురేష్ గారు ఆన్‌లైన్‌లో పల్లెసృజనతో తన అనుభవాలను పంచుకున్నారు. తదనంతరం జాగర్లమూడి దుర్గాప్రసాద్ గారు తానకు ప్రారంభ దశ నుండి పల్లెసృజన తో వున్న అనుబంధాన్ని, వివిధ దశలలో దాని యెదుగుదలలో తన పాత్రను గుర్తు చేస్తూ 20 సంవత్సరాలు చాలా





ఆనందంగా, అనేక మంది ఇన్నోవేటర్లకు చేయూతనిస్తూ జరిగిన పల్లెసృజన ప్రయాణాన్ని అభినందించారు.

భోజన విరామం అనంతరం పల్లెసృజన పత్రిక గురించి సంపాదకులు జమ్మలమడక శశిమోహన్ గారు మాట్లాడుతూ తాను పల్లెసృజన పత్రికలో చేరినప్పటి నుండి ఉభయ తెలుగు రాష్ట్రాలలో మారుమూల ప్రాంతాలలోని ఇన్నోవేటర్లని కలవటం, వారి కథలను, పుట్టు పూర్వోత్తరాలను, ఇన్నోవేషన్ వివరాలను సేకరించడం, వాటిని జనరంజకంగా వీలైనంత క్లుప్తంగా పత్రికలో ప్రచురించడం, పత్రికలో ప్రవేశ పెట్టిన, తీసివేసిన వివిధ అంశాలను, దానికి గల కారణాలను వివరిస్తూ ఈ పత్రిక ద్వారా ఇన్నోవేటర్లను ప్రపంచానికి పరిచయం చేయడంలో తానూ భాగస్వామి అయినందుకు ఆనందం వ్యక్తం చేశారు.

తరువాత పల్లెసృజన వ్యవస్థాపక సభ్యుడు, పల్లెసృజన పత్రిక ఉప సంపాదకుడు అయిన వీరరాఘవ రెడ్డి మాట్లాడుతూ 'పల్లెసృజన' సంస్థ ప్రారంభం, పల్లెసృజన పత్రిక ప్రారంభించాలనే ఆలోచన నుండి వివిధ దశలను వివరంగా చెపుతూ, పత్రిక నడపడంలో క్రియాశీలక పాత్ర పోషించిన వివిధ వ్యక్తులను గుర్తు చేసుకుంటూ పత్రిక నిరాటంకంగా 20 సంవత్సరాలు వెలువరించడమే, అదీ ఏవిధమైన ప్రకటనలు లేకుండా ప్రచురించటం, దానికి దేశ స్థాయిలో గల ఎన్ఐఎఫ్, హనీబీ పరిధిలోని సభ్య రాష్ట్రాలు ప్రచురించే పత్రికలలో మన పల్లెసృజన ఉత్తమ పత్రికగా ఎంపికై సన్మానింప బడటం, పల్లెసృజన పరిచయం చేసిన కొందరు ఇన్నోవేటర్లకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పురస్కారాలు రావటం, ముగ్గురిని 'పద్మశ్రీ' పురస్కారం వరించటం  తెలుగు వారికి గర్వకారణం అన్నారు.

చాలా కాలం పల్లెసృజన వెబ్‌సైట్‌ను నిర్వహించిన కీ.శే. కృష్ణ గారి స్థానంలో వారి సతీమణి .......... చెపుతూ ఎన్నో ప్రత్యేకతలు కలిగి, ప్రతిరోజూ ఏదో ఒక కార్యక్రమం జరిగే పల్లెసృజన వెబ్‌సైట్‌ను నిర్వహించడం, అదీ తన భర్త చేసిన పనినే తాను కొనసాగించే అవకాశం రావటం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

అనంతరం వాలంటీర్లు శ్రీ హరీష్, శ్రీ మోహన్ అదే విధంగా ఇన్నోవేటర్లయిన శ్రీ జాజి, శ్రీ బాలనర్సయ్యలు 'పల్లెసృజన' పత్రిక వలన సమాజానికి పల్లెసృజన కార్యక్రమాలను తెలియజేయ డానికి మార్గం చాలా సుగమమైందని, ఎవరిని పరిచయం చేసుకోవడానికైనా ముందు పత్రిక ఇచ్చి, మాట్లాడితే తమ పని సులువైందని అటువంటి పత్రిక నిరంతరం కొనసాగాలని తమ కోరికను తెలియజేశారు.

అనంతరం స్కాటింగ్ గురించి శ్రీ ఉప్పుతేళ్ళ కృష్ణ, క్రియేటివ్ మైండ్స్ మరియు వెబినార్‌ల గురించి శ్రీ సుభాష్ చందర్, శోధయాత్ర, జ్ఞానశోధ గురించి అంజిరెడ్డి గారు,పిల్లలలో సృజనాత్మకత గురించి శ్రీమతి అఖిల, ఇంటర్న్‌షిప్‌ల గురించి శ్రీమతి లక్ష్మి, పల్లెసృజన పెన్నిధి గురించి శ్రీ నాగమోహన్‌లు వివరించారు.

తదనంతరం ఇన్నోవేటర్లు శ్రీ అల్లాడి ప్రభాకర్, శ్రీ కొడిముంజ ప్రవీణ్, శ్రీ దామరసింగి బాబూరావు, శ్రీ మోదా శివకుమార్, శ్రీ పంపన శ్రీనివాస్, శ్రీ షణ్ముఖరావు, శ్రీ చింతకింది నరేందర్‌లు తమ ఇన్నోవేషన్ లు వెలుగు చూడటానికి పల్లెసృజన తమకు ఏవిధంగా తోడ్పడింది వివరంగా తెలియజేశారు.

తర్వాత జెఎన్‌టియు విశ్రాంత ప్రొఫెసర్ ఎబికె ప్రసాద్ గారు మాట్లాడుతూ.... ఇన్నోవేటర్లు తమ ఆలోచనా సరళి మార్చుకుని, తాము





ఆవిష్కరించిన ఇన్నోవేషన్లను సమాజంలోకి తీసుకు రావాలంటే ఎవరో సహాయం చేస్తారని వేచి చూడకుండా అంటే బయటి నిధులపై ఆధార పడకుండా తమకు తామే ఒకరికొకరు స్థిరపడ్డ ఇన్నోవేటర్లు మిగిలిన వారికి, అదేవిధంగా పల్లెసృజన శ్రేయోభిలాషుల నుండి నిధులు కానీ, ఇటువంటి వారికి సహాయం చేయడానికి ఒక కేంద్రీకృత నిధిని కానీ ఏర్పాటు చేసుకునే విధంగా ఆలోచించాలని సూచించారు.

తదనంతరం పల్లెసృజన కార్యక్రమాలలో కొత్త ఒరవడి సృష్టిస్తూ, శశిమోహన్ గారి నేతృత్వంలో వాలంటీర్లు - ముద్దం హరీష్, రాజశేఖర్‌గారు, మేధా, ధర్మోజు హరీష్, చరిత్, భానుచంద్రిక బృందం 'పల్లెసృజన' కార్యక్రమాలు ప్రస్ఫుటించేలా ఒక లఘు నాటికను ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు.

తరవాత సమాజంపై పల్లెసృజన ప్రభావం, పల్లెసృజన భవిష్యత్తు గురించి చర్చించుకొని తర్వాతి రోజు తమ సూచనలు ఇవ్వటానికి వాలంటీర్లను, ఇన్నోవేటర్లను 5 గుంపులుగా విభజించడం తో మొదటి రోజు కార్యక్రమం రాత్రి భోజనంతో ముగిసింది. రాత్రి భోజన సమయం, తరువాత అర్ధరాత్రి వరకు కూడా గుంపులు గుంపులుగా చర్చించుకోవడం చూస్తే పల్లెసృజనతో మమేకమైన వ్యక్తుల అలుపెరుగని ఉత్సాహం చూస్తే ఆనందం/ ఆశ్చర్యము వేసింది.

తరువాత క్రితం రోజు పల్లెసృజన వలన సమాజంపై ప్రభావం, పల్లెసృజన భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించి తమ అభిప్రాయాలు చెప్పమని ఏర్పాటు చేసిన 5 సమూహాలలో మొదటి సమూహం తరువున

**శ్రీ జాజి తమ సమూహం అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ....**

- ఆశ్చర్యకరంగా సమూహం లోని వ్యక్తులందరూ ఒకేవిధంగా ఆలోచించారు.
- అడగకుండానే మన ఇన్నోవేటర్లు సమాజానికి ఎనలేని సేవ చేస్తున్నారు.
- చాలా పాఠశాలల్లో అధ్యాపకులు పల్లెసృజన పత్రికను ఉదాహరణగా చూపుతూ పాఠాలు చెబుతూ చిన్నారుల్లోని సృజనాత్మకత ను వెలిగించే ప్రయత్నం చేస్తున్నారు.
- పల్లెసృజన పత్రిక ప్రచురణ ఆగకూడదు.
- మన వాలంటీర్లు కానీ, ఇన్నోవేటర్లు కాని వివిధ వ్యక్తులను, సంస్థలను కలవడానికి వెళ్ళినపుడు వాళ్ళ చేతికి ఇవ్వటానికి వీలుగా మన పత్రికతో పాటు మన ఇన్నోవేటర్ల కథలు, ఇతరులను ప్రోత్సహించే రీతిలో రాసి, ముద్రించి అందజేసే ప్రయత్నం చెయ్యాలి.
- పల్లెసృజనకు సంబంధించిన వారంతా పత్రికకి చందాదారు లను పెంచే ప్రయత్నం చెయ్యాలి.
- పల్లెసృజనకి ప్రత్యేకంగా ఒక యూట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేసుకొని మన కార్యక్రమాల వివరాలు ఎప్పటికప్పుడు అందులో అప్‌లోడ్ చెయ్యాలి.

**2వ సమూహం తరుపున శ్రీ పఠాన్ సైదా తమ సమూహపు అభిప్రాయాలను తెలియజేస్తూ......**

- గతంలో చేసినట్లుగానే పల్లెసృజన ఇంకా ఎక్కువ మందికి అవకాశాలు కల్పించే ప్రయత్నం చెయ్యాలి.
- పల్లెసృన వలన సమాజంలో చాలా మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ది పొందుతున్నారు.
- పల్లెసృజన వెలుగులోకి తీసిన ప్రతి ఇన్నోవేషను ఏదోవిధంగా సమాజంపై తప్పకుండా తన ప్రభావం చూపుతుంది.
- పల్లెసృజన ఇన్నోవేటర్లందరూ తమ ఉత్పత్తులను "ఒకే లోగో" వాడుతూ పల్లెసృజన పేరునే అమ్మకాలు జరిపితే ఒక ప్రత్యేక, బలమైన బ్రాండుగా ప్రసిద్ధి చెందుతుంది.
- పల్లెసృజన ప్రారంభించిన ఏ కార్యక్రమం కూడా వెనక్కి తగ్గకూడదు, ఆగకూడదు.
- పల్లెసృజన పత్రిక ప్రచురించే బాధ్యత ఇన్నోవేటర్లే తీసుకోవాలి.

**3వ సమూహం తరుపున ఉప్పుతేళ్ళ కృష్ణ మాట్లాడుతూ....**

- పల్లెసృజన పత్రిక ప్రభావం సమాజంపై చాలా ఉంది.
- తన కార్యక్రమాలు ప్రజల వద్దకు చేర్చటానికి పత్రిక ఒకటే మార్గం.
- వెబ్‌సైట్లలో పెట్టిన సమాచారం ఎవ్వరూ పట్టించుకోరు, ఎక్కువగా చూడరు.
- పల్లెసృజన కార్యక్రమాలు, ఇన్నోవేషన్లు సమాజంలో ఆర్థికంగా, ఆరోగ్యకరంగా, ఆలోచనా పరంగా కూడా ప్రభావితం చేస్తున్నాయి.
- సమస్యలు మన దగ్గరకు వస్తాయని కూర్చోకుండా పల్లెసృజన నే సమస్యల వద్దకు వెళ్ళి వాటికి సమాధానాలు చెప్పాలి.
- శోధయాత్రలలో మీ సమస్యలకి పరిష్కారం చూపుతాము అని విస్తృతంగా ప్రచారం చెయ్యాలి. అవసరమైతే అలాంటి బ్యానర్ పట్టుకు తిరగాలి.

**వాలంటీర్లలో మొదటి గుంపు తరుపున శ్రీ వివేక్ మాట్లాడుతూ....**

- ఇన్నోవేషన్లను వెతకటానికి స్కౌట్లు తక్కువగా ఉన్నందున ఎక్కువ మంది స్కౌట్లను వెతికే ప్రయత్నం చెయ్యాలి.
- ప్రతిదానికి పల్లెసృజన బ్రిగేడియర్ గారిమీద ఆధార పడకుండా వివిధ కార్యక్రమాలు ఎవరికి వారే చేపట్టి నడుపుకునే విధంగా ఆలోచించాలి.
- గ్రాస్‌రూట్స్ ఇంటర్న్ ఫెలోషిప్ దిశగా ఆలోచించాలి.
- పల్లెసృజన, క్రియేటివ్ మైండ్స్ కాక వీలైనంత వరకు ఒక మూడవ వ్యక్తిని పల్లెసృజన వ్యవహారాలు నడిపించేలా సిద్ధం చేసి, అతను



సమర్థవంతంగా నడపగలడు అని నిర్ధారణ చేసుకున్న తర్వాత ప్రస్తుతం వున్న కోర్ కమిటీ సలహాలు తీసుకుంటూ పల్లెసృజన వ్యవహారాలు నడిపేలా అతనికి అప్పజెప్పాలి.

**2వ వాలంటీర్ల సమూహం తరుపున శ్రీ క్రాంతి మాట్లాడుతూ.....**

- పల్లెసృజనకి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ఇంత గుర్తింపు, సత్కారాలు రావటమే దాని ప్రభావం సమాజంపై ఎంతుందో చెబుతోంది.
- పల్లెసృజన తన ఆలోచనా సరళి మార్చుకొని డబ్బు లేకుండా సేవ చేసే పద్ధతి కాక, డబ్బు సంపాదిస్తే ఎక్కువ సేవ చేసే అవకాశం ఉంటుందనే దిశగా ఆలోచించాలి.
- ప్రతి దానికీ అధ్యక్షుల వారిమీద ఆధార పడకుండా పనులు జరిగే మార్గాలను శోధించాలి.
- పల్లెసృజన తన ఉద్దేశ్యాలు, అవి సాధించే సూత్రాలు ఇతమిద్ధంగా, నిర్దిష్టంగా ఏర్పరచుకోవాలి.
- పల్లెసృజన ప్రస్తుత పద్ధతులు మాని, కొంచెం నూతనంగా నిధులు సమకూర్చుకునే దిశగా ఆలోచించాలి.

అనంతరం శ్రీ బాగయ్య గారు ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ పల్లె సృజన చేస్తున్న కార్యక్రమాలు తనకు సుపరిచితమే నని, తనకు తెలిసినంత వరకు దేశంలో ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్నది ఇదొక్కటేనని, ఇటువంటి సంస్థలు దేశవ్యాప్తంగా స్థాపించే దిశగా కృషి చెయ్యాలని అని అన్నారు. అంతే కాక, అందరూ చెప్పినట్లు భారతదేశ అభివృద్ధికి గ్రామాలు పట్టుకొమ్మలు అయినప్పుడు కేంద్రీకరణం దిశగా ఆలోచించకుండా, వికేంద్రీకరణ పద్ధతిలో అభివృద్ధి త్వరగా జరుగుతుందని గమనించాలి. మన దేశ ప్రధాని మోదీ గారి ఆధ్వర్యంలో వికసిత భారత్ సాధించటానికి అందరి భాగస్వామ్యం గమనిస్తే, జనాభా పరంగా కాని, సనాతనంగా వస్తున్న ప్రకృతి వనరుల పరంగా కానీ, గ్రామీణ భాగస్వామ్యం అతి ముఖ్యమైనదని అందరూ గుర్తించే దిశగా పల్లెసృజన లాంటి సంస్థలు పని చెయ్యాలి.

ఆ తర్వాత సమైక్యాంధ్ర నాబార్డ్ విశ్రాంత ఛీఫ్ జనరల్ మేనేజర్, మన పల్లెసృజనకు అప్తులు అయిన శ్రీ మోహనయ్య గారు మాట్లాడుతూ'పల్లెసృజన' అని పేరు పెట్టుకున్నా కేవలం పల్లెలకే పరిమితం కాకుండా, దేశంలోని అన్ని ప్రాంతాలకు అవసరమైన, పనికి వచ్చే ఇన్నోవేషన్లను వెలికి తీసి, వెలకట్టలేని సేవ చేస్తోందని కొనియాడా రు. తాను సహకార రంగంలో గమనించిన విషయం ఇక్కడ అప్రస్తుతం అయినా మీకు పనికి వస్తే ఆలోచించండి అని చెపుతూ, పల్లెసృజన తనకంటూ సొంత నిధులు ఏర్పాటు చేసుకుని తమ సేవలను విస్తృత పరిచే దిశగా పయనించాలి అంటే సంస్థని స్థాపించి, మ్యూచ్యువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ (మ్యాక్స్) సంఘాలు ఏవిధంగా అయితే ప్రభుత్వం నుంచి ఏ సహాయమూ లేకుండా తమ స్వశక్తితో కోట్ల రూపాయలు ప్రోగు చేసి, వ్యాపారాలు చేస్తున్నాయో ఉదహరిస్తూ.... ఈ విధమైన పని ఇన్నోవేటర్లు ఎందుకు చెయ్యకూడదో తీవ్రంగా ఆలోచించ వలసిన విషయమని సూచించారు. పల్లెసృజన విత్తనం వేస్తే తాను ఎరువు వేశానని (నాబార్డు తరుపున) అన్నారు. నా అదృష్టం ఏమిటంటే, సహాయం చేసే స్థితిలో నేనున్నా, నా దగ్గరకి మంచి విత్తనాలు తీసుకుని వచ్చి నా పని సులువు చేసి, నాకు తప్పని పరిస్థితి కల్పించారు. అదే పల్లెసృజన గొప్పదనం.

తరువాత జర్నలిస్ట్ రమేష్ గారు మాట్లాడుతూ.... పల్లెసృజన సంస్థ చేస్తున్న సేవలు 'నభూతో న భవిష్యతి' అన్నట్లుగా ఉంటాయని, పోల్చటానికి ఇటువంటి సేవలు చేస్తున్న సంస్థ ఎక్కడా లేదని చెబుతూ, పది కాలాల పాటు పల్లెసృజన సమాజం పట్ల తాను స్వచ్ఛందంగా ఎన్నుకున్న ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని కోరుకుంటున్నాను అని చెప్పారు.

ఎన్ఐఎఫ్ తరుపున డా. విపిన్ మాట్లాడుతూ, జాతీయ స్థాయి లో మేము ఏం పని చేస్తున్నామో అదే రాష్ట్ర స్థాయిలో కొన్ని రాష్ట్రాలు చేస్తున్నాయని, అందులో ఉత్తమమైన సేవలందిస్తున్న సంస్థలలో 'పల్లెసృజన' మొదటిది అని చెబుతూ ఒకే రకమైన సేవలంది స్తున్న కారణంగా పల్లెసృజనకి సలహాలు ఇవ్వటమో, సహాయం చెయ్యటమో సులభమవుతోందని, పల్లెసృజన ఇన్నోవేటర్ల సృజనలకు పేటెంట్ హక్కులు కల్పించే విషయంలో మా ఎన్ఐఎఫ్ పాత్ర కూడా ఉందని, ప్రస్తుతము – భవిష్యత్తులో కూడా పల్లెసృజన కార్యక్రమాలకు జాతీయ స్థాయిలోనే కాక, అంతర్జాతీయ స్థాయిలో కూడా మంచి గుర్తింపు రావటానికి ఎన్ఐఎఫ్ చేసే సహాయం ఇలాగే కొనసాగిస్తామని చెప్పారు.

నంద్యాల జిల్లాకు చెందిన అభ్యుదయ రైతు చాలా కాలంగా మన పల్లెసృజన శ్రేయోభిలాషి అయిన శ్రీ పోచా చిన్న నాగిరెడ్డి మాట్లాడుతూ తనకి పల్లెసృజనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ.... ఆ స్ఫూర్తితోనే తాను పని చేస్తున్నానని, అదే ఆదర్శాలను పాటిస్తున్నానని, అందుకనే అదే సూత్రాలపై ఆధార పడిన తాను 'పల్లె ప్రగతి' అనే పేరున ఒక స్వచ్ఛంద సంస్థను స్థాపించి, గ్రామ వికాసానికై తనవంతు పాత్రను పోషిస్తున్నానని, తను ఏ పని చేసినా ఇదే పల్లెసృజన చేస్తే ఎలా ఉంటుంది అని ఆలోచించి, అదేవిధంగా చేస్తున్నాని చెప్పి, పల్లెసృజన పట్ల తన కృతజ్ఞతలు తెలియజేశారు.

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ సైన్సెస్ తరుపున వచ్చిన డా. శ్రీనివాస్ గారు మాట్లాడుతూ.... వివిధ ఉన్నత విద్యా సంస్థలలో విద్యార్థులు పి. హెచ్‌డి చేసే వారికి కూడా అంతు పట్టని, మింగుడు పడని కార్యక్రమాలు, సేవ పల్లెసృజన చేస్తున్నది. క్లాస్ రూములలో వారు పుస్తకాలలో వున్న జ్ఞానాన్ని నేర్చుకుంటున్నారు కానీ, నిజ జీవితంలో పనికి వచ్చే జీవన జ్ఞానాన్ని అధ్యయనం చేయలేక పోతున్నారు. కారణం వెతికితే, విద్యార్థులు టీచర్లని, టీచర్లు మేనేజ్ మెంట్‌ని, మేనేజ్‌మెంట్









తల్లిదండ్రుల్ని.... ఇలా ఒకరికి ఒకరు కారణం అని, అసలు కారణాన్ని దాటవేస్తున్నారే కాని, అందరూ కలిస్తే పల్లెసృజన చేసే కార్యక్రమాలు కాలేజీలో కూడా చేసే అవకాశం సుగమం అవుతుంది. ఎందుకంటే తన సుదీర్ఘ అధ్యాపక జీవితంలో ప్రభుత్వం దగ్గర నుంచి అనేక స్వచ్ఛంద సంస్థల వరకు గ్రామీణ వికాసం గురించి, సేవల గురించి మాట్లాడుతారే తప్ప అన్ని వనరులు ఉన్న అనేక ఉన్నత విద్యాసంస్థలు చెయ్యలేని పని ఏ విధమైన వనరులు లేని పల్లెసృజన చేసి చూపిస్తున్నది. ఇంతకన్నా అందులో పని చేసే మహానుభావుల సామాజిక స్పృహ, దీక్ష, అవగాహన, స్ఫూర్తి గురించి నేనేం చెప్పగలను?

హితం కళాశాలకు చెందిన ప్రొఫెసర్ సురేందర్ గారు మాట్లాడుతూ.... ఈ పోటీ ప్రపంచంలో ప్రతి రంగంలో పోటీ ఉన్నట్లే మా కాలేజీల మధ్య కూడా పోటీ ఉంది. దానిని తట్టుకొని ముందుకు సాగడానికి 'పల్లెసృజన'తో మాకున్న సంబంధం, అది సూచించిన విధంగా మా విద్యార్థులను సామాజిక కార్యక్రమాలలో పాలు పచుకునే లా చేయటానికి మా అధ్యాపకులు, మా మేనేజ్‌మెంట్ చొరవ చూపటం తో సాధ్యమైంది. పల్లెసృజన క్రమం తప్పకుండా జాతీయ స్థాయిలో జరిగే శోధయాత్ర మాదిరి స్థానికంగా 'చిన్న శోధయాత్ర' పేరున జరిపే ఒక శోధయాత్రలో నేనూ, మా మేనేజ్‌మెంట్ ప్రోద్బలంతో పాల్గొనడం జరిగింది. అన్యమనస్కంగా పాల్గొన్న తరువాత ఇంత మంచి అవకాశం అధ్యాపకుడుగా నాకే కాక, అనేక సంస్థలకు చెందిన కొన్ని వేలమంది విద్యార్థులకు కూడా అనుభవం అయితే ఎంత బావుంటుందో అని ఆలోచించి, మా సంస్థ తరుపున పల్లెసృజన జరిపే ప్రతి శోధయాత్రలో మా విద్యార్థులను, అధ్యాపకులను తప్పనిసరిగా పాల్గొనే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ విధంగా విద్యార్థులు క్లాసు రూములలో నేర్చుకునేదానికన్నా, సామాజిక – సాంకేతిక విషయం ఈ శోధయాత్ర ల్లో నేర్చుకునే అవకాశము ఎక్కువ ఉంటుందని మా అపారమైన నమ్మకం.

తరవాత ...... వేల మంది విద్యార్థులున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని శ్రీమతి పుణ్యవతి గారు మాట్లాడుతూ.... తను పల్లెసృజన గురిచి, అవి చేసే కార్యక్రమాల గురించి ప్రత్యేకించి పాఠశాల విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మక ఆలోచనలను గ్రామీణ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు తీసుకు వెళ్ళి, దేశ రాష్ట్రపతి ద్వారా బహుమానం ఇప్పించే దిశగా తీసుకు వెళ్ళే క్రమంలో చేసే కృషి ఒక పిల్లల సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనటం ద్వారా తెలిసింది. అప్పటినుండి మా పాఠశాల పిల్లల్లో టీచర్ల సహాయంతో చేసే పరికరాలను ప్రదర్శించే అలవాటుకి స్వస్తి చెప్పి, పిల్లలు తామే స్వయంగా ప్రేరణ పొంది, ఉత్సాహంగా తామే పరికరాలను తయారు చేసి, సైన్స్ ఎగ్జిబిషన్‌లలో పాల్గొనే విధంగా తయారు చేయటానికి పల్లెసృజనతో నా సంపర్కం ఎంతో తోడ్పడింది. ప్రత్యేకించి మా బడి పిల్లలకు వివిధ స్థాయిలలో బహుమానాలు రావటం తో పల్లెసృజనపై నేను పెట్టుకున్న నమ్మకం వమ్ము కాలేదని రుజువైంది. తరువాత తెలిసింది నాలాగనే ఉభయ తెలుగు రాష్ట్రాలలో అనేక వేల మంది బడిపిల్లల నుండి సృజనాత్మక ఆలోచనలను పల్లెసృజనకు చెందిన వాలంటీర్లు సేకరించి, వాటిని క్రమపద్ధతిలో పెట్టి, "జాతీయ స్థాయి ఇగ్నైట్ పోటీ"లకు పంపించి, ఎన్నో బహుమతులను ఇప్పించేలా కృషి చేస్తుందని తెలిసి ముగ్ధురాలినయ్యాను. పల్లెసృజన బడిపిల్లలకు చేస్తున్న/కల్పిస్తున్న ఈ అవకాశానికి బాలలు మొత్తం కృతజ్ఞులై ఉండాలని భావిస్తున్నాను. నాలాగనే పాఠశాల టీచర్లు పిల్లలకు సంబంధించి పల్లెసృజన కల్పిస్తున్న అవకాశాలనుసద్వినియోగం చేసుకొని వారిని భావిభారత శాస్త్రజ్ఞులుగా తయారు చేయడంలో తమవంతు బాధ్యత నిర్వహించాలని మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నాను అన్నారు.

తర్వాత కెజి రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ డైరెక్టర్ డా. కందగట్ల రోహిత్ గారు ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ..... తాను పల్లెసృజన గురించి తెలుసుకున్న తర్వాత చాలా ఆలస్యంగా తెలుసుకున్నానే అన్న భావన కలిగింది. అది చేస్తున్న కార్యక్రమాలు తెలుసుకున్న తర్వాత ఇటువంటి కార్యక్రమాలు ప్రతి కళాశాలల్లో, పాఠ్యాంశాలలో భాగమై ఉండాలని మా కళాశాలలో పల్లెసృజన చేస్తున్న అనేక కార్యక్రమాలను మా విద్యార్థులకు పాఠ్యాంశాలుగా చేర్చి, అవి కార్యరూపం దాల్చటానికి బ్రిగేడియర్ గారి సహాయం తీసుకుని అమలు పరుస్తున్నాం. కళాశాలల్లో ఎంత నిష్ణాతులైన అధ్యాపకులు బోధించినా, అవన్నీ పూర్తిగా మా అకాడమిక్ పరిభాషలో 'బుక్కిష్ నాలెడ్జి అంటాము తప్ప పల్లెసృజన ఇన్నోవేటర్లు అదీ తన వాలంటీర్ల ద్వారా చేస్తున్న కార్యక్రమాలకు సరితూగే జ్ఞానాన్ని ఏ విశ్వవిద్యాలయం కూడా అందించలేదేమో అనిపిస్తోంది. చాలా అదృష్టవంతులకు మాత్రమే పల్లెసృజనతో సంపర్కం, సంబంధం, సన్నిహితత్వం ఏర్పడుతుందని నా నమ్మకం.

తదనంతరం ముగింపు కార్యక్రమాల్లో భాగంగా పల్లెసృజన కోర్‌కమిటీ సభ్యులైన శ్రీ శశిమోహన్ వేదిక మీదకు వచ్చి, తానొక ప్రత్యేక మైన విషయంపై మాట్లాడాలని చెప్తూ, పల్లెసృజన ఎన్ని కార్యక్రమాలు చేసినా, పల్లెసృజన గురించి ఎంతమంది ఎంత గొప్పగా చెప్పుకున్నా, పల్లెసృజన ఇన్నోవేటర్లకు ప్రపంచం జేజేలు పలికినా, దీనంతటికీ మూల, ముఖ్య కారణం దీని గురించి అహర్నిశలు ఎంతో శ్రమకోర్చి, ఏది ఎందుకు? అని ప్రశ్నించకుండా కేవలం పల్లెసృజన చేసే పనులపై నమ్మకం ఉండి, మనస్ఫూర్తిగా తమ సేవలందించే "పల్లెసృజన వాలంటీర్లకి" ధన్యవాదాలు చెప్పడానికి అవకాశమిమ్మని కోరారు. తదనంతరం ఆయన జి–20 సందర్భంగా మన హైదరాబాద్‌కు దొరికిన సి–20 కార్యక్రమాలలో భాగంగా "లైఫ్" ఉత్సవాలలో 'పల్లెసృజన' తనకు అప్పగించిన బాధ్యతను జాతీయ స్థాయిలో ఎంతో సమర్థవంతంగా, దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆశ్చర్యపోయే విధంగా బ్రిగేడియర్ గణేశం గారి ఆధ్వర్యంలో చేసిన కార్యక్రమం చిరస్మరణీయం. అదేవిధం

గా పల్లెసృజన ఏ స్థాయిలో కార్యక్రమం చేపట్టినా ముందు కాక, వెనక ఉండి మొత్తం కార్యక్రమం సునంపన్నం చేయడానికి కృషి చేసే 'వాలంటీర్లు' అందరినీ ఒక్కసారి వేదికమీదకి రావలసిందిగా ఆహ్వానించి, ప్రేక్షకులకి పరిచయం చేయటంతో గణేశం గారు గాద్గదమైన స్వరంతో వాలంటీర్లందరినీ ఆప్యాయంగా వేదిక మీదకు ఆహ్వానించి, పేరు పేరునా అందరినీ ప్రస్తావిస్తూ, పల్లెసృజన శక్తి అంటే మీరేనని కొనియాడుతూ ఉండగా అందరూ వారి సేవలకు నీరాజనాలు పలికారు.

తదనంతరం కోర్ కమిటీ సభ్యులు పల్లెసృజన ఉపాధ్యక్షులు అయిన శ్రీ జాగర్లమూడి దుర్గాప్రసాద్ గారు మాట్లాడుతూ, తాను పల్లెసృజన ప్రారంభ దశలోనే క్రియేటివ్ మైండ్స్ అనే ఉప సంస్థను మన ఇన్నోవేటర్ల ఉత్పాదనలను మార్కెటింగ్ చేయడానికి సదుపాయంగా ఉండటం కోసమే ప్రారంభించానని, పల్లెసృజన సంస్థ వారికి వివిధ స్థాయిలలో గుర్తింపు తీసుకు వచ్చి పురస్కారాలు తీసుకు రావడం వరకే సహాయం చేయగలదని, వారికి ఆర్థికంగా పుష్టిని చేకూర్చడం కోసం వారి ఉత్పత్తుల విక్రయానికి తాను క్రియేటివ్ మైండ్స్ స్థాపించానని, తరువాత కారణాంతరాల వల్ల క్రియేటివ్ మైండ్స్ బాధ్యతను పల్లెసృజన ద్వారా సుభాష్‌కు అప్పజెప్పడం జరిగిందని, అదేవిధంగా ఎక్కువ స్థాయిలో ఇన్నోవేటర్లకి తమ ఉత్పత్తుల విక్రయంలో సహాయం చేయడానికి శ్రీ వీరరాఘవ రెడ్డి 'పల్లెకిసాన్' సంస్థను స్థాపించి, తనవంతు కృషి చేస్తున్నాడని, ఇప్పుడు విడివిడిగా కాక, విడివిడిగా ఉన్నా, అందరూ 'పల్లెసృజన' ఇన్నోవేటర్ల ఉత్పత్తులను సమిష్టిగా (ఇన్నోవేటర్లు అందరూ ఒప్పుకుంటే) విక్రయాల్లో సహాయం చేయటానికి తాను గాని, రాఘవరెడ్డి గారు కానీ, సంసిద్ధంగా ఉన్నామని ప్రకటించి, ఏమాత్రం వీలు వున్నా, లేదా వీలు కల్పిచుకుని అందరూ కలిసి మన ఉత్పత్తులను పల్లె కిసాన్, గ్రామ బజార్, క్రియేటివ్ మైండ్స్ ద్వారా అమ్మితే అందరు ఇన్నోవేటర్లకి మేలు చేసిన వారమవుతామని సలహా ఇచ్చారు.

రెండురోజులపాటు జరిగిన 'పల్లెసృజన కుటుంబ పండుగ' కార్యక్రమం ముగింపుకు ముందుగా వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ పోగుల గణేశం గారు మాట్లాడుతూ.... ఈ రెండు రోజుల కార్యక్రమం 'కుటుంబ పండుగ' అని పేరు పెట్టుకున్నందుకు నిజంగా పండుగలాగే జరిగిందని, ఆనందంగా, ఆహ్లాదకర వాతావరణంలో అందరూ మనసు విప్పి కుటుంబ సభ్యులలాగా తమ మనోభావాలను వ్యక్తం చేశారని, ఈ 20 సంవత్సరాలలో పల్లెసృజన సృజనాత్మక పయనం పునశ్చరణ చేసుకుంటూ భవిష్యత్ కార్యక్రమాలకు దిశా నిర్దేశం చేయటానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాలనుండే కాక, దేశ విదేశాల నుండి అనేక మంది శ్రేయోభిలాషులు తమ సందేశాలను, సలహాలను, శుభాకాంక్షలను అందజేశారని, తాను పల్లెసృజన వాళ్ళందరికి సదా కృతజ్ఞత వెల్లడిస్తున్నాను. ఈ 20 సంవత్సరాల ప్రయాణం పల్లెసృజన కొన్ని స్వనిర్ణయ నియమాలను, కట్టుబాట్లను పాటిస్తూ ప్రయాణించిందని, భవిష్యత్తులో కొన్ని నిర్ణయాలను, నియమాలను మార్చుకోవాల్సి వస్తే మార్చుకునే ప్రయత్నం చేస్తూ కొత్త ఆలోచనలకు అనుగుణంగా తన సేవలను ఇంకా సమర్థవంతంగా, విస్తృతంగా చేసే దిశగా ఆలోచించాల్సిన సమయం వచ్చిందని గ్రహిం చిందని, సమీప భవిష్యత్తులో పల్లెసృజన నడిపే విధి విధానాలలో మార్పులు చేయవలసి వస్తే, అందరికీ తెలియజేసి, అందరి ఆమోదనతో ఆచరణలో పెడతామని, అందరి ఉద్దేశ్యమూ పల్లెసృజన జరిపే కార్యక్రమాలు విస్తృత పరిచి ఇంకా ఎక్కువ మందికి అవకాశం కల్పించి, దేశాభ్యుదయ కార్యక్రమాలలో తమవంతు బాధ్యత నిర్వహించాలని ఆలోచిస్తోందని చెప్తూ, అందరి ఆలోచనను మన్నిస్తూ 'కోర్ కమిటీ' ఆలోచనలను జోడిస్తూ మారవలసిన చోట మార్పులు చేస్తూ పల్లెసృజన సేవలను, కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా మరింతమందికి అందజేసే విధంగా ఎటువంటి మార్పులు చేయటానికైనా పల్లెసృజన సంసిద్ధంగా ఉందని తెలియజేస్తూ, ఈ 20 యేళ్ళ ప్రగతిపథ మధుర స్మృతులను చిరస్మరణీయం చేసుకుటూ, భవిష్యత్ కార్యక్రమాలకు రూపకల్పన చేసుకుటూ ముమ్ముందుకు సాగుదాం అని చెప్తూ, ఈ 20 యేళ్ళు పల్లెసృజనకి చేదోడు వాదోడుగా ఉన్న ఇన్నోవేటర్లకి, శ్రేయోభిలాషులకి, ఆర్థికంగా సహాయం చేసిన వారికి, వాలంటీర్లకి, ప్రత్యక్షంగా, పరోక్షంగా పల్లెసృజనతో కలిసి, దాని ప్రగతికి చేయూతనిచ్చిన వారందరికీ, మన అనేక కార్యక్రమాలలో ఆచరణాత్మ కంగా ముందుకు నడిపిన మన వాహనాల డ్రైవర్లకి! అందరికీ కృతజ్ఞతలు చెబుతూ ముమ్ముందు కూడా 'పల్లెసృజన' నడవటానికి, నడపటానికి మీ అందరి సహకారం కావాలని కోరుతూ, అందరికీ శుభం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాని సెలవు తీసుకోవటంతో కుటుంబ సమావేశం భావోద్వేగ వాతావరణం తో ముగిసింది.



# రైతుల కోసం 'పద్మశ్రీ' చింతల వెంకట్ రెడ్డి నూతన ఇన్నోవేషన్లు



- వీరరాఘవ రెడ్డి

'పల్లెసృజన' ఇన్నోవేటర్, 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత చింతల వెంకట్ రెడ్డి గారిని గురించి పాఠకులకు విదితమే. ప్రతి పంట సస్యరక్షణ, ఎదుగుదల మట్టితోనే సాధ్యమని నమ్మి, మట్టిపై తన ఇన్నోవేషన్లను గత 20 సంవత్సరాలుగా నిరూపిస్తూనే ఉన్నాడు. వాటిని యావత్ భారతావని రైతులు ఉపయోగించుకుని, ఆచరిస్తూ ఆరోగ్యకరమైన అధిక దిగుబడులను సాధిస్తూనే ఉన్నారు. 'మట్టి మనిషి' చింతల వెంకట్ రెడ్డి గారు '75వ వసంతం'లోకి అడుగు పెడుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని 2025 డిశంబర్, 22 నాడు తన ఇన్నోవేషన్ల పరంపరలో  రైతుదినోత్సవం (డిశంబర్ 23) కానుకగా మరికొన్ని అద్భుత ఇన్నోవేషన్లను రైతు లోకానికి అందించారు. తాను ఇప్పటికే మట్టిపై ఎన్నో ఇన్నోవేషన్లు చేసి, వాటి ఫలితాలను ముందుగా తాను పొందిన తర్వాత వాటిని ప్రపంచ వ్యాప్తంగా ఈ హక్కు మన తెలుగు రైతుకే ఉండాలని 'వరల్డ్ పేటెంట్' హక్కులు కూడా పొందారు. వారి సామర్థ్యాన్ని కనుగొన్న నాటి అమెరికా అధ్యక్షులు జార్జ్ డబ్ల్యు. బుష్ గారు ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వచ్చి, చింతల వెంకట్ రెడ్డి గారిని స్వయంగా అభినందించడం, ఆ తర్వాత 2019 లో భారత ప్రభుత్వం వారిని "పద్మశ్రీ" పురస్కారంతో గౌరవించడం జరిగింది. ఇంకా ఎన్నో దేశ స్థాయి, రాష్ట్ర స్థాయి పురస్కారాలు వారి వశమయ్యాయి.

మట్టే ఎరువు, మట్టే పురుగు మందుగా వినియోగిస్తూ, ఆ మట్టితోనే తన సృజనాత్మకతలను వెలుగులోకి తెస్తున్న చింతల వెంకట్ రెడ్డి గారు 2025 రైతు దినోత్సవం సందర్భంగా మన తెలుగు రైతులకు అందించిన కొత్త ఇన్నోవేషన్లను గురించిన వివరాలు మన పాఠకుల కోసం.......        - ఎడిటర్.

గడ్డే - గడ్డిని నివారిస్తుంది :

పొలంలోను, పొలం గట్ల వెంట వున్న గడ్డిని కోసి, ఆ గడ్డిని చాప్ కట్టర్ ద్వారా చిన్న చిన్న ముక్కలు చేసి, 5-6 రోజులు కుప్పగా వేసినట్లయితే ఆ పచ్చి గడ్డి కుప్ప నుండి వచ్చే వేడికి అందులోని గడ్డి విత్తనాలన్ని మొలకెత్తే సామర్థ్యాన్ని కోల్పోతాయి. కాబట్టి ఇక పొలంలో గడ్డి మొలవదు. కొద్ది రోజుల తర్వాత గడ్డిని బాగా ఎండబెట్టి, ఆ ఎండిన గడ్డి పిడికెడు తీసుకుని తన ద్రాక్ష చెట్లకు వేసిన డ్రిప్పర్ల వద్ద పెట్టి,



జార్జి బుష్, వైఎస్ రాజశేఖర రెడ్డిలతో చింతల వెంకట్ రెడ్డి



'పద్మశ్రీ' పురస్కారం అందుకుంటున్న చింతల వెంకట్ రెడ్డి













దానిపైన ఆముదపు చెక్క కొద్దిగా వేసి మట్టితో పూడ్చాడు. ఆ తర్వాత కేవలం 15 రోజుల్లో ద్రాక్ష చెట్లలో ఎదుగుదల, పచ్చదనం చాలా అద్భుతంగా వచ్చింది. ఈ గడ్డి ప్రయోగాన్ని పరీక్షించాలన్న ఉద్దేశ్యంతోనే తన తోటలోని కొన్ని ద్రాక్ష చెట్ల వరుసలకు ఈ గడ్డిని అందించకుండా పెట్టాడు. 15 రోజుల తర్వాత గడ్డి వెయ్యని చెట్లకు, వేసిన చెట్లకు చాలా తేడా ఉందని గమనించాడు. ఇదంతా జరిగింది ఎప్పుడో కాదు, 2025 వేసవి కాలం మే 5–6 తేదీల్లో చేసి ఫలితం సాధించిన ప్రయోగమిది.

గడ్డిని ఇలా ముక్కలు చేసి 5–6 రోజులు కుప్పగా వేస్తే, అది కుళ్ళుతున్నపుడు వాతావరణంలో వున్న నత్రజనిని గ్రహించి తనలో నిక్షిప్తం చేసుకుంటుంది. అంతే కాదు, పాస్ఫరస్, పొటాష్, మెగ్నీషియం, క్యాల్షియమ్ లాంటి అన్ని రకాల వాతావరణంలో వున్న పోషకాలను ఈ గడ్డి గ్రహిస్తుంది అని తెలుసుకున్నాడు. పంట బాగా ఎదుగుతోంది, భాస్వరం ఏమైనా తక్కువ అవుతుందేమోనని గోధుమలను మొలకెత్తించి, ఆరబెట్టి పిండి పట్టించాడు. దానితో పాటు సోయా విత్తనాలను అలాగే మెత్తగా పిండి పట్టించి, ఈ రెండు పిండి పదార్థాలను ఒక్కో డ్రిప్పర్ వద్ద ఒక్కో పిడికిలి వేశాడు. అలా వేసిన కేవలం రెండే రోజుల్లోనే పంట ఎదుగుదల (గ్రోత్) ఇంకా బాగా వచ్చింది. మొత్తానికి తన ద్రాక్ష చెట్లకు ఎటువంటి రసాయన ఎరువు వాడకుండా కేవలం గడ్డి, మొలకెత్తిన గోధుమ పిండి, సోయా పిండి వర్షా కాలంలో ఒక్కో చెట్టు దగ్గర కొంత పేడ ఎరువు తోనే అద్భుతమైన ఎదుగుదలను సాధించారు, పైగా చీడపీడల సమస్య కూడా చాలావరకు తగ్గిందని గ్రహించారు వెంకట్ రెడ్డి గారు. ఈ బియ్యం నూకల్లో ఏ పదార్థం వల్ల ఇలా జరుగుతుంది అని ఇంటర్‌నెట్‌లో గూగుల్‌లో చూడగా బియ్యం, నూకలల్లో 'ఆర్సెనిక్' అనే పదార్థం ఉంటుందని, ఇది చీడ పీడలకు విషం లాగా పని చేస్తుందని గ్రహించాడు. కానీ ఈ పదార్థం మిత్ర పురుగులకు మాత్రం మంచి ఆహారంగా ఉపయోగ పడుతుంది. అందుకే నూకలు చల్లడం వల్ల భూమిలో ఎరలు కూడా బాగా పెరిగడంతో భూమి గుల్లబారింది.

ఈ గడ్డిని ఇంకా కొద్దిగా లోతు గుంతలో వేసినట్లయితే ఇంకా ఎన్నో పోషకాలను, బ్యాక్టీరియాను గ్రహిస్తుంది. గుంతలో గడ్డి ముక్కలను వేసి దానిపైన అప్పుడప్పుడు నీళ్ళు చల్లుతూ ఉంటే చాలు. వేలాది రూపాయలు వెచ్చించి కొన్న రసాయన ఎరువులకన్నా ఎన్నో రెట్ల అధిక పోషకాలు ఆ గడ్డిలో నిక్షిప్తం అవుతాయి. ఇది పంటకు నిదానంగా అందిస్తునే ఉంటుంది అంటారాయన. తాను మొదటి పేటెంట్ తీసుకున్న పుడు పొలంలో ఒక గెట్టున 4 అడుగుల లోతు గుంతను త్రవ్వి, అందు లోని మట్టిని ఒకవైపు వేసి, పొలంలోని పై మట్టితో ఆ గుంతను పూడ్చ టం జరిగింది. పొలంలోని పై మట్టిలో వున్న వరి, గడ్డి అందులో వుండటం వల్ల అవన్నీ 4 అడుగుల లోతులోకి వెళ్ళడం వల్ల అవి కంపోస్టుగా మారి, 20 సంవత్సరాలకు పైగానే అయినా ఇప్పటికీ అక్కడ పంట ఏపుగానే పెరుగుతూ ఉండటమే ఇందుకు ఉదాహరణ అంటారాయన.

ఇక పంటలపై చీడపీడల నివారణ కొరకు మొలకెత్తిన గోధుమలు, రాత్రి నానబెట్టిన సోయాలను కలిపి ఉదయం మెత్తటి పిండిగా రుబ్బుకుని, వాటిని నీటిలో కలిపి పంటపై పిచికారి చేసినట్ల యితే పంటకుఎటువంటి చీడపీడలు ఆశించవు. రాత్రిపూట నానబెట్టి ఉదయం రుబ్బడం సాధ్యం కాకపోతే, వరి ధాన్యం మొలకెత్తిన తర్వాత బాగా ఎండబెట్టి, అందులో సోయా విత్తనాలను కలిపి రెండింటినీ ఒక్కో కిలో చొప్పున తీసుకుని, మెత్తటి పిండిగా జిన్ను పట్టించి నీటిలో కలిపి పిచికారి చేసినా కూడా అదే ఫలితం వస్తుంది అంటారాయన. సోయా విత్తనాల వల్ల రైతుకు ఇంతటి లాభాలు ఉంటాయి. సోయాను కుళ్ళబెట్టొద్దు, కేవలం పిండి పట్టిస్తే చాలు అద్భుతమైన ఫలితాలు వస్తాయి(ప్రు. ఈ విధంగా పిచికారి చెయ్యటం వల్ల చీడ పీడలు అరికట్ట బడటంతో పాటు, పంట ఎదుగుదలకు కూడా ఉపయోగ పడుతుంది.

అలాగే ఒక కిలో మొక్కజొన్నలు, ఒక కిలో సోయా విత్తనాలను తీసుకుని మెత్తటి పిండిగా పట్టించి నీటిలో కలిపి పిచికారి చేసినా కూడా మంచి ఫలితం ఉంటుంది. కేవలం సోయా పిండి వాడితే అందులో నూనె శాతం ఎక్కువగా ఉంటుంది కాబట్టి అందులోకి మొక్క జొన్న లేదా గోధుమ లేదా వరి మొలకలు కలిపి పిచికారి చేస్తేనే మంచి ఫలితం ఉంటుంది అంటారాయన. ఈ పిండిని కొద్దిగా దొడ్డుగా పట్టించి వేర్లకు అందిస్తే దీర్ఘకాలంగా పని చేస్తుంది, మెత్తటి పిండిగా పట్టిస్తే త్వరితగతిని పని చేస్తుంది. ఈ పిండి మిశ్రమాన్ని పంటలపై పిచికారి





చింతల వెంకట్ రెడ్డి గారి ద్రాక్ష తోటలో

గడ్డి, ఆముదపు చెక్క వేసిన చెట్లు 15 రోజుల తర్వాత

గడ్డి, ఆముదపు చెక్క వెయ్యని చెట్లు 15 రోజుల తర్వాత



మురిగిన గడ్డి, ఆముదపు చెక్క, మొలకల గోధుమ+సోయా పిండి వేసిన చెట్లు ప్రస్తుతం ఇలా కాపుతో కళకళలాడుతున్నాయి.



అవన్నీ వెయ్యనిచెట్లు ప్రస్తుతం ఇలా కాపు ఇంకా రాక వెవెల బోతున్నాయి.

చెయ్యటం ద్వారా ఫంగీసైడ్‌గాను, పురుగు మందుగాను పని చేస్తుంది. ఈ పిచికారి వల్ల ఇందులోని సోయా వల్ల త్రిప్స్, మైట్స్, మిల్లీ బగ్ లతో పాటు ఎటువంటి పురుగు కూడా పంటను ఆశించదు. తెగుళ్ళను కూడా సమర్థవంతంగా అరికడుతుంది.

సోయా ప్రధానంగా తీసుకుని, అందులో ఒకసారి మొక్క జొన్నలు, మరోసారి గోధుమలు ఇలా మార్చి మార్చి పిండి పట్టించి మొక్క మొదలు వద్ద మరియు నీటిలో కలిపి పిచికారి చేసినట్లయితే పంటను ఎటువంటి చీడపీడల బారిన పడకుండా కాపాడుకోవచ్చు అంటారు చింతల వెంకట్ రెడ్డి గారు.

**వరి నూకలతోనే వరి పంట ఎదుగుదల:**

గత 20 సంవత్సరాల నుండి తన వరి పొలాన్ని మట్టి ద్రావణంతోనే పండిస్తున్నారు చింతల వెంకట్ రెడ్డి అలా చేయటం వల్ల తన వరి బియ్యంలో 'ఎ' మరియు 'డి-3' విటమిన్లు సమృద్ధిగా ఉన్నాయి. ఒకరోజు చింతల వెంకట్ రెడ్డి గారి సతీమణి ఇంట్లో గత సంవత్సరం బియ్యంలో వచ్చిన నూకలు పురుగు పడుతున్నాయి. వీటిని ఏమిటికైనా ఉపయోగించమని చెప్పింది. సరేనని వాటిని పొలానికి తీసుకు వెళ్ళి కొద్దిగా ఆలోచించి తన వరి మళ్ళలో ఒకదానిలో ఈ నూకలలోంచి ఒక పది కిలోల నూకలను యూరియాలాగా చల్లించాడు. 15 రోజుల తర్వాత చూస్తే మిగతా వరిమళ్ళకు నూకలు చల్లిన మడికి చాలా తేడాను గమనించాడు. నూకలు చల్లిన మడిలో వరిదుబ్బులు బాగా కట్టింది, ఆకులు కూడా వెడల్పుగా ఉండటం గమనించాడు. మిగతా మళ్ళు అలా లేకపోవటంతో 'వరి నూకలు యూరియా' లాగా పనిచేశాయే అని అనుకున్నాడు. ఆ తర్వాత మిగతా మళ్ళకు కూడా చల్లిస్తే అవి కూడా



బాగా దుబ్బులు కట్టి, ఆకులు వెడల్పుగా మారాయి. అప్పుడు అనుకున్నాడు. రైతులంతా యూరియా, యూరియా అంటూ డబ్బులు తగలేసుకుంటున్నారు, వరి నూకలు యూరియా లాగా పని చేస్తున్నాయి కదా అనుకున్నాడు. ఆ తర్వాత ఆ వరికి 'సోయా, మొక్కజొన్న' లను పిండి పట్టించి చల్లడంతో ఎటువంటి చీడ పీడలు లేకుండా కంకులు కూడా అంతా ఒక్కసారిగా ఆరోగ్యంగా వచ్చాయి. ఆ తర్వాత మట్టిలో ఆముదము, కుంకుడు కాయలు కూడా కలపడంతో వరి పంట చాలా ఆరోగ్యంగా పెరిగింది అన్నారు. వరి నూకలు చల్లేటపుడు భూమిలో బురదలో కాలు ఎక్కువగా దిగబడేది కాదు. కానీ, నూకలు చల్లిన 15 రోజుల తర్వాత వరిమళ్ళో కాలు పెడితే బాగా లోతుగా దిగబడింది. అంటే ఈ నూకలు చల్లడం వల్ల భూమి కూడా వదులుగా మారి, పంట త్వరగా ఎదగటానికి తోడ్పడింది అని గ్రహించారు చింతల వెంకట్ రెడ్డి.

ఈ సోయా మరియు మొక్క జొన్నలలో పోషకాలు అధికంగా ఉంటాయి, 'డి' విటమిన్ కూడా సమృద్ధిగా ఉంటుంది కనుక వాటి పిండిని చల్లించడంతో తన వరి ఎటువంటి చీడపీడలు లేకుండా, మంచి దిగుబడి వచ్చిందని అన్నారు చింతల వెంకట్ రెడ్డి. కాబట్టి రైతులు తమ వరి పంటపై ఎటువంటి పురుగు మందులు, యూరియా ఉపయోగించ కుండా వరి నూకలు, మట్టి+ఆముదము+కుంకుడు కాయల మిశ్రమం, ఆ తర్వాత సోయ+మొక్కజొన్న విత్తనాల పిండి చల్లితే చాలు ఇక ఎటువంటి ఎరువులు, రసాయన పురుగు మందులు అవసరమే ఉండదని, పంట కూడా ఎటువంటి చీడ పీడలు సోకకుండా మంచి ఆరోగ్యకరమైన దిగుబడి సాధించవచ్చు అంటున్నారు చింతల వెంకట్ రెడ్డి.

ఇదే పద్ధతిని కూరగాయల పంటలలో కూడా చేస్తే అవి కూడా ఎటువంటి చీడపీడలు లేకుండా ఆరోగ్యంగా మంచి దిగుబడి వచ్చాయని కాబట్టి రైతులు తమ పొలాలకు ఎటువంటి రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా, పైన చెప్పిన విధంగా సస్యరక్షణ చర్యలు తీసుకుని ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను పండించాలని కోరుకుంటున్నారు. ఇలా చేయటం వల్ల భూమి కూడా గట్టిగా మారకుండా పొడి పొడిగా పొంగుతూ ఉండటం వల్ల భూమి ఆరోగ్యం బాగుపడి, వర్షపు నీరు కూడా భూమిలోకి ఇంకి పోయి, భవిష్యత్తులో మంచి దిగుబడులు సాధించవచ్చు అని తెలియజేస్తున్నారు చింతల వెంకట్ రెడ్డి. ●

**ఇన్నోవేటర్ 'పద్మశ్రీ' చింతల వెంకట్ రెడ్డి ఫోన్ : 9866883336**



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## చెట్టు మోడును వేర్లతో సహా భూమిలోంచి పెకిలించేందుకు ట్రాక్టర్ అనుసంధాన పరికరం

**ఇందర్‌జిత్ సింగ్ ఖాస్,** ఔరంగాబాద్, మహారాష్ట్ర.

**జాతీయస్థాయి ద్వితీయ బహుమతి**



మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన 47 సంవత్సరాల ఇందర్‌జిత్ సింగ్ వెల్డింగ్ పని చేస్తుంటాడు. ఇతనికి యంత్రాలు ప్రత్యేకించి వ్యవసాయానికి సంబంధించిన పరికరాలు, యంత్రాలు రూపొందించటం అంటే ఎక్కువ ఇష్టం. ఇదే క్రమంలో ఇతడు తన రైతు మిత్రులు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించటానికి అల్లం, పసుపు నాటే యంత్రం రూపొందించాడు.

కొన్ని సంవత్సరాల క్రితం ఇతనికి తెలిసిన రైతు ఒకతను 'సుబాబుల్' చెట్లు నాడటం, చెట్లు పెద్దవి అయినాక మొదలు వద్ద చెట్లని నరకి వేస్తాం కానీ, ఆ చెట్టు మొదళ్ళు వేళ్ళతో పొలంలోనే ఉండి పోతాయి. వాటిని తీయటానికి ఒక జెసిబి యజమానిని అడిగితే 14 ఎకరాలలో ఈ చెట్ల మొదళ్ళు తీసివెయ్యటానికి రూ. 1.8 లక్షలు అడిగాడు. ఆ రైతు ఇందర్‌జిత్ సింగ్ వద్దకి వెళ్ళి తానంత ఖర్చు పెట్టుకోలేను దీనికేదైనా చవకైన మార్గం ఉందా? అని అడగటం జరిగింది. దానికితను కొంత కాలం శ్రమించి ట్రాక్టర్‌కి అనుసంధానం



చేసే విధంగా ఒక పరికరాన్ని తయారు చేశాడు.

ఈ చెట్టు మోడులను వేళ్ళతో సహా పెకలించే పరికరం 30 హార్స్‌పవర్ కన్నా ఎక్కువ శక్తి ఉన్న ట్రాక్టర్ వెనకవైపు బిగించుకోవాల్సి ఉంటుంది. ఇది మూడు భాగాలుగా ఉండి కలిసి పని చేస్తుంది. ఒక హైడ్రాలిక్ డబుల్ యాక్టింగ్ సిలిండరు ట్రాక్టరు యొక్క హైడ్రాలిక్ పైకి బిగించాల్సి ఉంటుంది. ఇది చెట్టు మోడును గట్టిగా పట్టుకునేలా రూపొందించబడింది. ఇంకొక రెండు చేతుల లాంటివి, ఒకటి భూమిలో త్రవ్వటానికి, ఒకటి మోడును పెకలించటానికి ఉంటాయి. ఈ పరికరం 150 కిలోల బరువుండి గంటకి సుమారు మూడున్నర లీటర్ల డీజిలుతో పని చేస్తుంది. ఒక ఎకరానికి చెట్ల మొదళ్ళని భూమిలోనుంచి పెకలించ డానికి 10 గంటల సమయం పడుతుంది. ఈ పరికరం భూమిలోంచి 8 అడుగుల లోతునుంచి చెట్ల వేర్లను పెకలించ గలదు. దీని సహాయంతో సుబాబుల్, యూకలిప్టస్ లాంటి చెట్ల మోడులను భూమిలోనుంచి లాగెయ్యవచ్చు. మామూలు జెసిబితో ఈ పని చెయ్యటానికి రూ. 12 నుండి 15 వేల దాకా బాడుగ చెల్లించాల్సి ఉండగా, ఈ పరికరంతో దాని కన్నా ఎంతో తక్కువ ఖర్చుతో పని చేస్తుంది.




## అధిక దిగుబడినిచ్చే ఎస్‌కె-4 పసుపు రకం

**సచిన్ కమలాకర్ కరేకర్,** రత్నగిరి, మహారాష్ట్ర.

**జాతీయస్థాయి ద్వితీయ బహుమతి**



మహారాష్ట్రలోని రత్నగిరికి చెందిన 43 సంవత్సరాల సచిన్ కమలాకర్ ఆ ప్రాంతంలో చురుకైన అభ్యుదయ రైతు. ఈయన సాధారణంగా కొబ్బరి, మామిడి, వక్క, పసుపు పండిస్తూ ఉంటాడు. ముందు నుంచి కూడా ఇతనికి ఎక్కువ దిగుబడినిచ్చే పసుపు రకాన్ని రూపొందించాలని కోరిక ఉండేది.

1998 లోనే అంటు కట్టి ఎంపిక చేసే పద్ధతిలో అధిక దిగుబడినిచ్చే పసుపు రకం వేట ప్రారంభించాడు. ముందుగా స్థానకంగా అందరూ వేసే 'కడ్జా' రకం పసుపు వేయగా, అందులో కొన్ని మొక్కలు త్వరగా కాపుకు వచ్చి, మంచి ఘాటు ఉండటం గమనించాడు. ముందుగా కొన్ని లక్షణాలను ఊహించుకొని దానికి తగట్టు ఎంపిక




చేయడం ప్రారంభించాడు. క్రమంగా తాను ఎంపిక చేసిన మొక్కల్లో నుండి ప్రతిసారి చీడ పీడలని తట్టుకునేలా, పెద్దసైజు కొమ్ములు ఉండి, మంచి రంగు ఉండేలా, అధిక దిగుబడినిచ్చే లాంటి లక్షణాలు గల మొక్కలను 2007 వరకు ఎంపిక చేసి, అంటు కట్టి అభివృద్ధి చేశాడు. 2008 నాటికి తాను పైన అనుకున్న లక్షణాలు అన్నీ గల రకాన్ని స్థిర పరిచి దానికి తన పేరులోని మొదటి అక్షరాలు వచ్చేలా 'ఎస్‌కె-4' అని నామకరణం చేశాడు.

ఈ రకం అధిక దిగుబడినిస్తూ (హెక్టారుకి 50 టన్నులు), మంచి ఎరుపు – పసుపు మిళితంతో కలిగిన రంగుతో, పెద్ద కొమ్ములు కలిగి ఉండి తక్కువ కాలంలో (160–170 రోజుల్లో) కొమ్ములు కుళ్ళి పోయే రోగాన్ని కూడా తట్టుకునేలా ఈ రకాన్ని రూపొందించుకున్నాడు.

ధాకోలీ లోని డా. బాలాసాహెబ్ సావంత్ కొంకణ్ కృషి విద్యా పీఠ్ వారు 2020 ఖరీఫ్ సమయంలో ఈ రకంపై పరీక్షలు జరిపి, చాలా ప్రోత్సాహకరంగా ఉందని నిర్ధారణ చేశారు. వారి పరీక్షలలో హెక్టారుకు 56 టన్నుల దిగుబడి వచ్చింది. ఆ సమయంలో ఆ సంస్థ 32 రకాలపై జరిపిన పరీక్షలలో ఎస్‌కె–4 రకం ఉత్తమమైనదిగా ధృవీకరించారు. ఇది ఆకుమచ్చ తెగులు, కొమ్ము కుళ్ళిపోయే రోగాన్ని తట్టుకునే శక్తి కలదని నిర్ధారించారు. తానే స్వయంగా కొందరు రైతులకి ఈ రకం మొక్కలు పరీక్షకని ఇవ్వగా వారంతా ఇంత మంచి రకం పసుపు ఎప్పుడూ చూడలేదని చెప్పారట! 2021 నాటికి ఈ ఎస్‌కె–4 రకం కేవలం మహారాష్ట్ర లోనే లక్షకు పైగా మొక్కలు అమ్ముడు పోయాయి. ఎన్ఐఎఫ్ వారి సహాయంతో ఆహార పదార్థాలు పేటెంట్ చేసే పిపివి & ఎఫ్ఆర్ యాక్ట్ – 2001 ప్రకారం దీనిని పేటెంట్ కొరకు దరఖాస్తు చేశారు.

# సెప్టెంబర్ - అక్టోబర్ 2025 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు







'సినాప్సిస్, యునైటెడ్ వే, హైదరాబాద్' వారు 'పల్లెసృజన' సహకారంతో "గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను ఉపయోగించి 'సిఎస్ఆర్' క్రింద ఆలేరు-జనగాం చేనేత కుటుంబాలకు చెందిన మహిళలకు "నైపుణ్యం మరియు మగ్గం శిక్షణ" కార్యక్రమంలో 2024 నవంబర్ నుండి నేటి వరకు 200 మందికి పైగా మహిళలు శిక్షణ పొందడం జరిగింది.





12 నవంబర్, 2025న హైదరాబాద్ సమీపంలో 'బివిఐసి, ఘట్‌కేసర్' నందు ఏర్పాటు చేసిన "బివిఐసి-ఇంపల్స్" పేరుతో ఏర్పాటు చేసిన సదస్సులో 10 మంది 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు పాల్గొని తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రి 'శ్రీమతి కొండా సురేఖ, బివిఐసి కి చెందిన శౌరి రెడ్డి మరియు రాహుల్ భరద్వాజ్'లు తిలకించి, మన ఇన్నోవేటర్లను అభినందనలు తెలియజేశారు.



15 నవంబర్, 2025 ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఆఫ్రికా మరియు ఆసియా కు చెందిన అధికారులు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించి, అక్కడ ప్రదర్శించిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను తిలకించి, వాటి గురించిన సమాచారాన్ని తెలుసుకుని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ఎంతో అర్థవంతంగా జరిగింది.



24-11-2025 న అహమ్మదాబాద్‌లో జరిగిన 'జాగృతి యాత్ర' కార్యక్రమంలో 'పల్లెసృజన' ఇన్నోవేటర్లతో పాటు బ్రిగేడియర్ గణేశం గారు పాల్గొన్నప్పటి దృశ్యం.







8 డిశంబర్, 2025న ఢిల్లీలో జరిగిన 'పీపుల్స్ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్స్' సందర్భంలో ఆ ప్రదర్శనలో పాల్గొన్న 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు.









30-12-2025 న మంగళగిరి (అమరావతి) లోని 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' (ఆర్.టి.ఐ.హెచ్.) వారు ఏర్పాటు చేసిన "గ్రాస్ రూట్స్ ఇన్నోవేటర్స్ సమ్మిట్" కార్యక్రమంలో 'పల్లెసృజన ఇన్నోవేటర్లు 25 మంది తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌టిఐహెచ్ సి.ఇ.ఓ. శ్రీమతి ధాత్రి రెడ్డి ప్రదర్శనను తిలకించి, గ్రాస్ రూట్స్ ఇన్నోవేషన్లను గురించి వివరంగా ఇన్నోవేటర్లతో మాట్లాడి, వారి వారి ఇన్నోవేషన్లను గురించి తెలుసుకోవటం జరిగింది. భవిష్యత్‌లో ఆర్‌టిఐహెచ్ ద్వారా ఈ గ్రాస్ రూట్స్ ఇన్నోవేషన్లకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, వీటిని సమాజానికి ఇంకా బాగా ఉపయోగ పడేందుకు కృషి చేస్తామని అన్నారు. 'పల్లెసృజన' వ్యవస్థాపకులు బ్రిగేడియర్ గణేశం గారు సిఇఓ గారికి ఒక్కో ఇన్నోవేటర్‌ను పరిచయం చేస్తూ, వారి గురించి, వారి ఇన్నోవేషన్‌లను గురించి తెలియజేశారు.

"ఇన్వెన్షన్, ఇన్నోవేషన్ & టెక్నాలజీ ఎక్స్‌పొజిషన్" (ఐపిఐటిఇఎక్స్) - 2026
బ్యాంకాక్, థాయ్‌లాండ్ : : 05-09 జనవరి, 2026 ద్వారా

## ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన

# 'పల్లెసృజన' ఇన్నోవేషన్లు - ఇన్నోవేటర్లు




- వీరరాఘవ రెడ్డి

థాయ్‌లాండ్, బ్యాంకాక్‌లో 2026 జనవరి, 5 నుండి 9వ తేది వరకు జరిగిన IPITEx 2026 లో పల్లెసృజన 'IFIA భారత్', 'మిలియన్ మ్యూటినీస్, 'రోటరీ బెంగుళూరు దిశ – డిస్ట్రిక్ట్ 3192' మరియు 'కాకతీయ సాండ్ బాక్స్' సంస్థల సహకారంతో, వ్యవసాయం, నీరు, పర్యావరణం మరియు గ్రామీణ జీవనోపాధులకు చెందిన పరిష్కారాలను చూపే ఇన్నోవేషన్‌లను ప్రదర్శించింది. ఈ కార్యక్రమంలో మన పల్లెసృజన తరుపున పాల్గొన్న గ్రామీణ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లు దేశీయ పరిజ్ఞానంతో, తక్కువ ఖర్చుతో అందించిన పరిష్కారాలు. కానీ సమాజంపైన ఏవిధంగా సమస్యలను పరిష్కరిస్తున్నాయో ప్రపంచ దేశాలకు స్పష్టంగా చూపించాయి.

**అవార్డులు, గుర్తింపులు & ప్రశంసలు:**

మన గ్రామీణ ఆవిష్కర్తలు ఈసారి అంతర్జాతీయ స్థాయిలో విశేషమైన గుర్తింపు, పురస్కారాలు మరియు ప్రత్యేక ప్రశంసలు అందుకొని 2026 నూతన సంవత్సరానికి ఘనమైన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్నోవేటర్లు... కొడిముంజ ప్రవీణ్ కుమార్, గోదాను నర్సింహ, అల్లాడి ప్రణయ్ కుమార్, పంపన శ్రీనివాస్, తిరుమలశెట్టి శ్రీనివాస రావు, గల్లా చంద్రశేఖర్ మరియు చింతకింది మల్లేశంలు పాల్గొనగా, వీరితో పాటు పల్లెసృజన వాలంటీర్లు సుభాష్ మరియు శ్యాంసుందర్‌లు వారికి తోడుగా వెళ్లటం జరిగింది.

**పతకాల వివరాలు ఈ విధంగా....**

❀ **బంగారు పతకం :** మల్బరీ కొమ్మలను కోత కోసి, కట్టలు కట్టిచ్చే ట్రాక్టర్ అనుసంధాన పరికరం తయారు చేసినందుకు తెలంగాణ లోని సిరిసిల్ల జిల్లాకు చెందిన ఇన్నోవేటర్ 'కొడిముంజ ప్రవీణ్' పొందాడు.

❀ **వెండి పతకం :** చెరువులు, కాలువల్లో గుర్రపు డెక్క పేరుకుపోయి, నీరు కలుషితమై, పర్యావరణానికి చాలా హాని చేసే గుర్రపు డెక్కను తొలగించేందుకు ఒక యంత్రాన్ని తయారు చేసిన తెలంగాణ లోని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన 'గోదాసు నర్సింహ' కు దక్కింది.

❀ **కాంస్య పతకం :** అల్లాడి ప్రభాకర్ మరియు అతని కుమారుడు అల్లాడి ప్రణయ్ కుమార్‌లు గ్రామాలు, పట్టణాల్లో వృధాగా పడివుండి, శుభ్రతకు, పర్యావరణానికి హాని కలిగించే కొబ్బరి బోండాంలను వలిచి, వాటినుండి పీచు, కోకోపిట్‌లను వేరుగా అందించే యంత్రాన్ని తయారు చేసినందుకు గాను కాంస్య పతకాన్ని పొందం జరిగింది.

**IFIA గ్లోబల్ సభ్యుల ప్రత్యేక గుర్తింపు మరియు అవార్డులు:**

❀ **పంపన శ్రీనివాస్** – నదులు, వాగుల్లో కేవలం 3 అడుగుల ఎత్తు నుండి పారే నీటి క్రింద ఒక టర్బయిన్ అమర్చడం ద్వారా ఎటువంటి ఇంధనం, కరెంటు ఖర్చు లేకుండా ఉచితంగా నీరు పారేలా చేసిన శ్రీనివాస్‌ను ఫిలిప్పీన్స్ ఇన్వెంటర్స్ సొసైటీ అధ్యక్షులు రొనాల్డ్ పి. పాగ్‌సంఘున్ మరియు ఆల్ రష్యన్ సొసైటీ ఆఫ్ ఇన్వెంటర్స్ & రేషనలైజర్స్ కు చెందిన ఐరత్ గినియతుల్లిన్ నుండి గుర్తింపు మరియు అవార్డు పొందారు.

❀ **తిరుమలశెట్టి శ్రీనివాస రావు** – ఆక్వా ఫార్మ్స్ కోసం తయారు చేసిన 'మొబైల్ ఏరియేటర్'ను తయారు చేసినందుకు గాను రొమేనియన్ ఇన్వెంటర్స్ ఫోరంకు చెందిన కొర్నెలియు బిర్టోణ – బనియాసా నుండి గుర్తింపు మరియు అవార్డు పొందాడు.

❀ **గల్లా చంద్రశేఖర్** – పంట పొలాల్లో కలుపు మరియు నిమటోడ్స్ నివారణకు, మూలికలతో పర్యావరణానికి ఎటువంటి హాని చేయని పురుగు మందులను తయారు చేసినందుకు గాను రొమేనియన్ ఇన్వెంటర్స్ ఫోరంకు చెందిన కొర్నెలియు బిర్టోక్–బనియాసా నుండి గుర్తింపు మరియు అవార్డు పొందారు. ఈ పురస్కారాలు భారత దేశం లోని తక్కువ ఖర్చుతో చేసే పునాది స్థాయి ఇన్నోవేషన్లు సమాజానికి ఎంత విస్తృతంగా ఉపయోగ పడతాయో ప్రపంచంలో వాటి ప్రాముఖ్యత ఎంతగా ఉన్నదో అన్న విషయాన్ని చాటి చెపుతున్నాయి.

**కృతజ్ఞతలు & ధన్యవాదములు:**

IPITEx 2026,థాయిలాండ్ లో జరిగిన కార్యక్రమంలో



ప్రవీణ్ 'గోల్డ్ మెడల్' నర్సింహా 'సిల్వర్ మెడల్' ప్రణయ్ 'కాంస్యమెడల్' పంపన శ్రీనివాస్ ప్రత్యేక ప్రశంసలు అందుకున్న తిరుమలశెట్టి శ్రీనివాస్ గల్లా చంద్రశేఖర్

పల్లెసృజనకు చెందిన గ్రామీణ ఆవిష్కర్తలు అంతర్జాతీయ వేదికను చేరుకునేలా ఉదారంగా సహకరించిన 'మిలియన్ మ్యూటినీస్', 'రోటరీ బెంగుళూరు దిశ–డిస్ట్రిక్స్ 3192' మరియు 'కాకతీయ సాండ్‌బాక్స్' సంస్థలకు 'పల్లెసృజన' మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తోంది. వారి సహకారం గ్రామీణ ఆవిష్కరణలు మరియు అంతర్జాతీయ గుర్తింపు మధ్య మరింత బలమైన వంతెనగా నిలుస్తుంది. మొత్తానికి అంతర్జాతీయంగా మన తెలుగు ఇన్నోవేటర్ల ఖ్యాతి అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శింప బడటం 'పల్లెసృజన' చరిత్రలో మరో మైలురాయి.

## థాయ్‌లాండ్‌లో 'చింతకింది మల్లేశం'కు లభించిన "విచిత్రమైన అనుభూతి"

"మల్లేశం" – ఒక సినిమా కాదు.... ఒక అంతర్జాతీయ ప్రభావం. మల్లేశం సినిమా ఒక కథ మాత్రమే కాదు. అది ఒక ఆలోచన. ఒక ఆవిష్కరణ. ఒక మనిషికి తల్లిపట్ల ఉన్న బాధ నుంచి పుట్టిన ఉద్యమం. ఆ ఉద్యమం ఈరోజు అంతర్జాతీయ స్థాయిలో యువతను ప్రేరేపిస్తోంది అన్నది నేను స్వయంగా చూసిన సత్యం.

జనవరి 5 నుంచ 9 వరకు జరిగిన IPITEX 2026 – నాకు గర్వకారణమైన ఘనత. బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ మేథాసంపత్తి, ఆవిష్కరణలు, వినూత్నత మరియు సాంకేతిక ప్రదర్శన IPI TEX అంతరాజతీయ ఇన్నోవేషన్ సెమినార్లలో పాల్గొనే అవకాశం నాకు లభించింది. భారతదేశంతో పాటు సుమారు 30 దేశాల నుండి వచ్చిన ఆవిష్కర్తలు తమ ఇన్నోవేషన్లను అక్కడ ప్రదర్శించారు. ఆ వేదికపై నిలబడి మనదేశ చేనేత కార్మికుల కోసం పుట్టిన ఒక ఆవిష్కరణ గురించి వివరిస్తుండగా... ఒక అద్భుతమైన సంఘటన జరిగింది. నా స్టాక్‌అ దాదాపు పది స్టాల్ల దూరంలో, మలేషియా నుంచి వచ్చిన ఒక యువకుడు "నాథన్" తన ఇన్నోవేషన్‌ను ప్రదర్శిస్తున్నాడు. అన్ని స్టాల్లను పరిశీలిస్తూ వచ్చిన అతను, నా స్టాల్ వద్ద ఆగాడు. "ఇది ఏంటి? దేనికి ఉపయోగ పడుతుంది అని ఆసక్తిగా అడిగాను. నేను చెప్పాను – "ఇది భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో చేనేత కార్మికులు చేతితో చేసే కష్టమైన పనిని సులభతరం చేయడానికి రూపొందించిన యంత్రం. ముఖ్యంగా మహిళా కార్మికుల శారీరక శ్రమ తగ్గించడానికి ఈ ఆవిష్కరణ ఉపయోగ పడింది" అని. అతను మౌనంగా, లీనమై చూస్తున్నాడు. అప్పుడు నేను చెప్పాను – "ఈ ఆవిష్కరణపై ఒక బయోపిక్ కూడా వచ్చింది. ఆ సినిమా పేరు మల్లేశం". అతను ఒక్కసారిగా ఆశ్చర్యంతో, "This movie? I have seen it!" అని అన్నాడు. నేను నమ్మలేక పోయాను. "తెలుగు సినిమా కదా... మీకు భాష ఎలా అర్థమైంది?" అని అడిగితే, అతను నవ్వుతూ చెప్పాడు – "Subtitles. I understood everything. This movie inspired me. That inspiration made me think... and that thinking led me to my innovation." ఆ మాటలు చెప్తున్న సమయంలో అతని కళ్లలో కన్నీళ్లు. నన్ను ఆప్యాయంగా హత్తుకున్నాడు. ఆ కన్నీళ్లు బాధనుంచి వచ్చినవి కాదు – కృతజ్ఞత, ప్రేరణ, ఆనందంతో వచ్చిన ఆనంద భాష్పాలు. ఆ క్షణంలో నాకు అర్థమైది – ఈ సినిమా ఒక వ్యక్తి జీవితాన్ని మార్చింది. ఒక దేశం కాదు.... ఒక ఖండం కాదు... సరిహద్దులు దాటింది. ఇది కేవలం ఒక స్క్రిప్ట్ కాదు. ఇది నిజ జీవిత బయోపిక్. రాసినా నమ్మలేని సంఘటన – కానీ నేను అక్కడ ప్రత్యక్షంగా చూశాను. థాయిలాండ్‌లో స్కూలు పిల్లలకు కూడా ఈ ఆవిష్కరణ గురించి వివరించాను. వాళ్ళు టిక్‌టాక్‌లో చూంన మల్లేశం వీడియోల గురించి చెప్పారు. ఒక యువతి వచ్చింది. పోస్టర్ చదివింది. వీడియో చూసింది. ఆ తర్వాత ఆమె ఫోన్‌లో సినిమా సీన్ చూపిస్తూ అడిగింది – "Is this the same person?" "అవును" అన్నాను. ఆమె ఆనందంతో, "Wow! I met a great person from a movie I admired!" అని చెప్పి, మాతో ఫొటో దిగింది.

ఆరోజు నాకు నిజంగా అనిపించింది – నేను భగవంతుడు రాసిన ఒక గొప్ప స్క్రిప్ట్‌లో భాగం అయ్యాను. ఈ సినిమా తీసినందుకు ధర్యంగా ముందుకు వచ్చిన నిర్మాతకు, కంటెంట్‌ను నమ్మిన దర్శక బృందానికి, హృదయంతో నటించిన నటీనటులకు, ప్రత్యేకంగా ఈ కథను ప్రపంచానికి చెప్పాలనే సంకల్పంతో నిలబడ్డ ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మల్లేశం సినిమా తెలుగు రాష్ట్రాలకు గర్వకారణం. భారతదేశానికి గౌరవం. ప్రపంచానికి ప్రేరణ. ఈ ఆనందాన్ని మీతో పంచుకోవడం నా అదృష్టం.

ఈ అనుభవం నా జీవితం ధన్యమైంది అనిపించేలా చేసింది. మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. – మీ **చింతకింది మల్లేశం,** ఇన్నోవేటర్, ఆలేరు, యాదాద్రి జిల్లా, తెలంగాణ. ఫోన్ : 79894 03563.










# 55వ చిన్న శోధయాత్ర

2025 డిశంబర్ 19 నుండి 21 వ

# యాత్రీకుల అనుభవాలు

\- వీర రాఘవ రెడ్డి

పల్లెసృజన నిరంతరాయంగా నిర్వహిస్తున్న 55వ చిన్నశోధ యాత్ర 2025 డిశంబర్ 19 నుండి 21 వరకు నల్గొండ జిల్లా, పెద్ద కాపర్తి నుండి యం.జి. యూనివర్శిటీ దాకా నిర్వహించ బడింది. ఈ శోధయాత్రలో పాల్గొన్న యాత్రీకులు తమ యాత్ర అనుభవాలను పల్లెసృజనతో పంచుకున్నారు. వాటి వివరాలు....

**కొమెర అంకారావు (జాజి) స్పందన:**

యాత్ర మొదటి రోజు ఉదయం పెద్ద కాపర్తి లోని ఒక ఫంక్షన్ హాల్‌లో సమావేశమై శోధయాత్ర విధి విధానాలను గురించి బ్రిగేడియర్ గణేశం గారు వివరంగా చెప్పారు. మూడు రోజుల పాటు ఈ యాత్రను జరుపుకుంటాం, నడుచుకుంటూ వెళ్ళడం ద్వారా గ్రామీణుల జ్ఞానాన్ని మనం సేకరించుకుంటూ వెళ్తాం. ఊర్లోకి వెళ్ళిన తర్వాత అందరం ఎవరికి వారం విడిపోయి, గ్రామాల్లో వున్న విషయ పరిజ్ఞానాన్ని సేకరించి, మళ్ళీ ఊరి నుండి బయట పడే సమయానికి అందరం కలుసు కుంటామని తెలియజేశారు. అక్కడి నుండి అందరం గుంపుగా బయలు దేరి మరో గ్రామానికి వెళ్తాము. ఎందుకంటే అలా గుంపుగా వెళ్ళటం వలన మన కంటికి కనిపించే విశేషాలను అందరం ఒకేసారి చూసే అవకాశం ఉంటుంది అన్నారు.

అక్కడి నుండి ఊర్లోకి బయలుదేరిన తర్వాత మాకు ఒక వ్యక్తి తన టివిఎస్ వాహనంపైన సుమారుగా 30 కిలోల ప్లాస్టిక్ ను వేసుకుని వెళ్తున్నాడు. గత 15 సంవత్సరాలుగా అతని దినచర్య అదేనట. అతను ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుకుని, గోతాము సంచుల్లో వేసుకుని తీసుకు వెళ్ళి అమ్ముకుంటూ ఉంటాడు. అంటే ఒక మండలంలో రోజూ ఎంత ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రజలు వేస్తున్నారనేది అతన్ని చూస్తే అర్థమైంది. గ్రామాల పరిధిలోనే రోజుకు 30 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు లభిస్తున్నాయంటే, ఇక పట్టణాల గురించి ఎంత ప్లాస్టిక్ వ్యర్థాలు లభిస్తున్నాయో, దీనివల్ల పర్యావరణానికి ఎంత నష్టం జరుగుతుందో మనం ఊహిం చుకోవచ్చు. అంటే అతను ఈ ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ కొరకు పాటు పడుతూ జన జీవనం కొనసాగిస్తున్నాడని అర్థమైంది. ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తూ ఒక రకంగా పర్యావరణానికి, సమాజానికి మేలు చేస్తున్న అతన్ని సురేష్ గుప్తా అనే ఒక యాత్రీకుడు పోచంపల్లి చేనేత శాలువా అందివ్వటంతో అతన్ని సత్కరించడంతో అతను ఎంతో ఆనందపడ్డాడు.

తర్వాత మా యాత్ర పెద్దకాపర్తి గ్రామంలో ప్రవేశించిన తర్వాత అక్కడ 'ప్రత్తి మిల్లు' ఒకటి యాత్రీకులకు కనిపించింది. అందులోకి వెళ్ళి ప్రత్తిని ఎలా మిల్లింగ్ చేస్తారో చూద్దామని లోపలికి వెళ్ళగా, అక్కడ చాలా మంది యాత్రీకులకు అక్కడ ఏర్పడ్డ వాతావరణం చూసి తుమ్ములు వచ్చాయి. అక్కడి గాలిలో ఎంతో దుమ్ము, ధూళి ఉండటం వల్ల ఇంతలా తమ్ములు వస్తున్న వాతావరణంలో అక్కడి కార్మికులు ఎలా ఇంత కాలుష్యాన్ని తట్టుకుని పనిచేస్తున్నారని ఆశ్చర్యం వేసింది.

ఆ తర్వాత మా యాత్ర ఆరెగూడెం దాటి మొర్సు గూడెంలోకి చేరుకుంది. అక్కడ సురేష్ గుప్తా గారికి పరిచయమున్న, 80 సం.ల








వయో వృద్ధుడైన ఆదర్శ రైతు 'సత్తిరెడ్డి' గారిని కలవటం జరిగింది. వారి ఇల్లు రోడ్డు పక్కనే ఉన్న ఒక పెద్ద బంగళా లాగా ఉంది. ఆ ఇంట్లో వారివద్ద కూర్చుని ముచ్చటించగా, ఆయన 40 సంవత్సరాల క్రితమే ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరిస్తూ, దాన్ని విస్తృతంగా ప్రచారం చేశాడట. ఈ విషయాన్ని ఆ చుట్టు ప్రక్కల వాళ్ళు కూడా చెప్పారు మాకు. అప్పట్లో ఎటువంటి ప్రచార మాద్యమాలు పెద్దగా లేకున్నా, ప్రకృతి వ్యవసాయం కోసం ఆయన చేసిన మేలు మరువలేనిది. తాను ప్రచారం కోసం కాకుండా కేవలం తన 'చిట్యాల మండలం' లోని రైతులు బాగు పడితే చాలు అన్న సంకల్పంతో పాటు పడ్డారని తెలుసుకుని యాత్రీ కులం ఎంతో సంతోషించాము. అంతరించి పోతున్న 'రాబందులు', కాకులు, పిచ్చుకలను, తాను చూసిన వాటి గురించి అద్భుతంగా చెప్పాడు. ఇవన్నీ ఇప్పుడు కనుమరుగై పోతున్నాయని చాలా ఆందోళన పడ్డాడు. ఇవన్నీ అంతరించి పోకుండా పునరుజ్జీవనం పొందాలంటే ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమని చెప్పారాయన. ఎటువంటి ఫలితాన్ని ఆశించకుండా గ్రామాల్లోని విశేషాలను, జ్ఞానాన్ని శోధించడాని కి మీరు చేస్తున్న యాత్ర అమోఘమని యాత్రీకులందరినీ సంతోషంగా ఆశీర్వదించారాయన.

ఆ తర్వాత సత్తిరెడ్డి గారి భార్యపేరు 'జంగమ్మ'. ఆమె ముఖానికి పసుపు పూసుకుని, పెద్ద బొట్టుతో నిండు ముత్తయిదువగా కనిపించింది. ఆవిడ కొందరు ఆడవాళ్ళతో ముచ్చట్లాడుతూ తన చేతిలో ఒక చాటలో కాకరకాయ పై పెక్కులను వేసుకుని ఉంది. జాజి ఆమెను ఇదేమిటమ్మా అని అడగగా, ఇది కాకరకాయ పైతొక్కు నాయనా అంది. దీంతో ఏమి చేస్తావు అని అడుగగా, ఆమె దీంతో పచ్చడి చేసుకుంటాము, చాలా బాగా ఉంటుంది అంది. అదేంటమ్మా కాకరకాయ పై పొక్కు చాలా చేదుగా ఉంటుంది కదా అంటే, ఇందులో నిమ్మకాయ, నూనె ఇతర దినుసులు వేసి చెట్నీ చేసుకుంటే మహా రుచిగా ఉంటుంది అంది. తాము ఇంత వరకు కాకర కాయ ఏ రకంగా వంట చేసుకున్నా, పైపొక్కు తీసే వాళ్ళనే చూశాము కాని, పొక్కుతో చెట్నీ చేయటం ఆమె వద్దనే తెలుసుకున్నాము. ఆ ఇంట్లో చాలా ఇసుర్రాళ్ళు కనిపించాయి. చెక్క కుర్చీలు, చెక్క మంచాలు చూస్తుంటే ఆ ఇంటి వాతావరణం అంతా రైతు సంసారానికి నిదర్శనంగా కనిపించింది.

అక్కడి నుంచి తిన్నగా చిన్న కప్పర్తి దాటి, బోయ గుబ్బకు వెళ్ళాం. ఆ ఊర్లో ఆడవాళ్ళ పేర్లు చాలా బాగున్నాయి, చంద్రమ్మ, చిలకమ్మ, రంగమ్మ, జంగమ్మ, మంగమ్మ.... ఇలా అందరి పేర్ల చివరలో 'అమ్మ' పదం ఉంది. అందులో చిలకమ్మ అనే ఆవిడను పలుకరించగా ఆమె చిలక లాగే కిలకిలా నవ్వుతోంది 65 ఏళ్ళ చిలకమ్మ. మరి కాస్త ముందుకు వెళ్ళగా మంగమ్మ అనే 65 ఏళ్ళ వృద్ధురాలు తమ మాగాణిలో గోచీ పెట్టుకుని మగాడిలా గెనాలు నరుకుతుండటం చూశాము. ఆమెను ఏం పెద్దమ్మా, ఈ వయసులో, చలిలో, ఇలా నీటిలో పని చేస్తుంటే నీకు వళ్ళు అలిసి పోదా అంట, ఆమె మరి బువ్వెట్ల బిడ్డా అంది. ఆధునిక వనితలు, ఇంటి పనికి, వంట పనికి మనుషులను పెట్టుకుని, ఒళ్ళు పెరిగితే, దాన్ని తగ్గించుకోవటానికి జిమ్ముకు వెళ్తారు. దాని బదులు ఇలా తమపని తాము చేసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు కదా అనిపించింది.

ఆ తర్వాత 'వేంబావి' గ్రామానికి చేరుకుని అక్కడ జిల్లా పరిషత్ పాఠశాలలో భోజనాలు చేశాము. ఆ తర్వాత అక్కడ స్కూలు పిల్లలతో మాట్లాడటం జరిగింది. అక్కడి విశేషాలను చూసుకుంటూ 'తాళ్ళవెలను' గ్రామం చేరుకుని అక్కడికి చేరుకున్న దాదాపు వందకు పైగా మహిళలు, రైతులతో ముచ్చటించాము. వారికి తమ కష్టాలను ఎదుర్కొనే పరికరాలను తామే తయారు చేసుకోవాలని చెప్తూ, కొన్ని ఇన్నోవేషన్లను గురించి, వాటిని తయారు చేసిన ఇన్నోవేటర్లను గురించి వివరించడంతో రైతులు మీరు చెప్పిన ఆలోచనలు చాలా బాగున్నాయని, ఇలాంటి ఒక సంస్థ ఉందని, మాకు అవసరమైన పరికరాలు మేమే ఆలోచించి తయారు చేసుకునేలా ప్రేరేపిస్తున్నారని ప్రశంసించారు. తర్వాత ఆ గ్రామస్తులు స్వయంగా ఏర్పాటు చేసుకున్న ఒక గ్రంథాలయాన్ని చూపించారు. ఆ గ్రంథాలయంలో ఆధ్యాత్మిక పుస్తకాలు, రైతులకు సంబంధించినవి లాంటి ఎన్నో ఉన్నాయని, ఇప్పటి నుంచి 'పల్లెసృజన' కు చెందిన పుస్తకాలను కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆ గ్రామంలో పాఠశాలలో ఆ రోజు జరిగిన కార్యక్రమాలను గురించి చర్చించుకుని, నిద్రకు ఉపక్రమించాము.

ఉదయం ఆ గ్రామం నుంచి బయలుదేరుతున్నపుడు తోవలో 'శ్రీకృష్ణ ఆర్గానిక్ మందిరం' అనే బోర్డు ఒకటి కనపడింది. దాని గురించి వాకబు చేయగా ఒక రైతు శ్రీకృష్ణుని గుడి నిర్మించుకొని, తన పొలంలో సేంద్రియ వ్యవసాయం చేసుకుంటున్నాడని అన్నారు. ఆ తర్వాత





'కచ్లాపూర్' అనే గ్రామం వైపుకు అడుగులు వేశాము. దారిలో 'జక్కుల రమేష్' అనే వ్యక్తి పరిచయమయ్యారు. అతను తన భార్యతో సహా తాము చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి సేంద్రియ వ్యవసాయం చెయ్యాలన్న ఉద్దేశ్యంతో గ్రామం చేరుకున్నామని, తాము 10 రకాల దాకా వరిని పండిస్తుంటామని వాటిలో 6 రకాల బియ్యాన్ని యాత్రీకులకు చూపించారు. ఆ బియ్యంతో తయారు చేసిన జావను యాత్రీకులకు రుచి చూపించారు. చిన్న వయసులో పట్టణంలో ఉద్యోగాన్ని వదిలి, సేంద్రియ వ్యవసాయం కొరకు కృషి చేస్తున్నావని ప్రశంసించగా, మమ్మల్ని మా ఊర్లో వాళ్ళే పట్టించుకోరు, మీరు అభినందిస్తున్నారు అన్నారు. ఇంత మంచి పని చేస్తున్న మిమ్మల్ని 'పల్లెసృజన' చిరు సన్మానంతో సత్కరిస్తోందని, జాజితోనే ఆ యువ జంటను శాలువాతో సత్కరించారు. దారిలో చాలా మంది మహిళలు, పెద్ద పెద్ద వెండి కడియాలు, ముక్కు పుడకలతో చాలా బాగా అగుపించారు.



ఒక ఊరిలో 'కాటి కాపరి' కనపడ్డాడు. అతను చేతిలో ఒక కంచు పళ్లెం లాంటిది పెట్టుకొని 'టంగ్ టంగ్' మంటూ కొట్టుకుంటూ ఇంటింటికీ వెళ్తున్న విచిత్రమైన వేషధారిని చూశారు. అందరినీ ఇంటింటికీ వెళ్ళి తన గంటతో నిద్ర లేపుతారు, ఆ తర్వాత అతను మళ్ళీ ఇంటింటికీ వెళ్ళి వారు ఇచ్చిన భిక్ష తీసుకోవడం అతని దినచర్య. ఆ ప్రాంత గ్రామాలన్నీ చాలా ప్రశాంతంగా కనిపించాయి, ఎటువంటి రణగొణ ధ్వనులు, టీవీ శబ్దాలు లేవు, చక్కగా మాగాణి పొలాలు చేసుకుంటున్నారు, ఎంతో అందంగా అగుపించాయి గ్రామాలన్నీ. దారి పొడవునా, జాజి, అంజిరెడ్డి, బాల నర్సయ్య లు యాత్రీకులకు, అక్కడక్కడా కనపడ్డ గ్రామస్తులకు ఔషధ మొక్కలను గురించి, అవి ఏయే రోగాలకు పనిచేస్తాయో వివరిస్తూ వెళ్ళటం జరిగింది.

ఒకరోజు ఒక పాఠశాలలో చిన్న పిల్లల 'ఇగ్నైట్' ఐడియాలను వారిచేత వ్రాయించడం జరిగింది. అందులో ఒక 3-4వ తరగతో చదువుతున్న ఒక అబ్బాయి విచిత్రంగా కనిపించాడు. అతని ప్రత్యేకత



ఏమిటంటే, అతను రాముడు, సీత, లక్ష్మణులు అరణ్యాలకు వెళ్తున్న బొమ్మను గుసుకుని వచ్చాడు. ఇందులో ప్రత్యేకత ఏమిటంటే, ఆ పిల్లాడు వారి వెనకవైపు బొమ్మలను గీశాడు. ఎవరైనా ముందు వైపు గీస్తారు, నువ్వేమిటి వెనకవైపు బొమ్మలు వేశాడు ఈ అబ్బాయి ఒక ప్రత్యేకమైన జ్ఞానం కలవాడు అని ప్రశంసించారు గణేశం గారు. ఆ స్కూలు హెడ్మాస్టరుతో కూడా ఇలాంటి ప్రత్యేకమైన ఆలోచనలు గల వారినే మేము ప్రోత్సహిస్తూ ఉంటాము. మీరు ఇలాంటి వారిని ప్రోత్సహిస్తే వారిలోని జ్ఞానం ఇంకా వెలుగులోకి వస్తుంది అన్నారు. అలా గ్రామాలన్నీ చూసుకుంటూ రాత్రికి 'అప్పాజీ పేట' చేరుకున్నాము.

మరునాడు దారిలో ఒక పెద్దావిడ తన అనుభవాలను, ప్రస్తుతం జరుగుతున్న మార్పులను, పూర్వపు రోజులను గురించి చాలా బాగా యాత్రీకులకు వివరించడంతో యాత్రీకులు ఆమెను శాలువాతో సత్కరించారు. ఆమెతో యాత్రీకులు మాట్లాడుతున్నపుడు వారి మనవడు యాత్రీకులను చూసి వీరేదో రాజకీయ ప్రచారకులో లేక మత ప్రచారకులో అనుకుని విసుక్కున్నాడు. ఆ తర్వాత మేము అలాంటి వారము కాదు, ఇటువంటి వారి వల్ల జ్ఞానాన్ని సేకరించే సంస్థ 'పల్లెసృజన' నుంచి వచ్చాము అని తెలుసుకుని యాత్రీకులను ఆ అబ్బాయి క్షమాపణలు కోరాడు.

ఒకచోట యాత్రీకులకు ఒక సందేశాత్మక కథ చెప్పమని జాజితో చెప్పగా తను ఒక కథను చెప్పాడు. ఒక గురువు ముగ్గురు అబ్బాయిలను తలో బకెట్‌లో నీళ్ళు తీసుకు రమ్మన్నాడు. ఆ మగ్గురిలో ఒకరికి మట్టి బొమ్మ, ఒకరికి గాజు బొమ్మ మరొకరికి పంచదారతో చేసిన బొమ్మను ఇచ్చాడు. ఆ తర్వాత వారికి సమాజం గురించిన విషయాలను చెప్పి, ఇప్పుడు ఆ బొమ్మలను బైటకు తియ్యమని ముందుగా మట్టి బొమ్మ ఇచ్చిన అబ్బాయికి చెప్పాడు. అతను నీటిలో బొమ్మ లేదు గురువు గారు, నీళ్ళన్నీ మళినమై పోయాయి అన్నాడు. దాని నీతిని గురించి చెపుతూ ఇలా సమాజంలో కొందరు వ్యక్తులు ఉంటారు. తాము కరిగి పోయినా సరే సమాన్ని భ్రష్టు పట్టించాలన్న తలంపుతో ఉంటారు. ఇటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలి అన్నారు. తర్వాత గాజు బొమ్మను ఇచ్చిన శిష్యుడితో బొమ్మ తియ్యమని చెప్పాడు గురువు గారు. అతను బొమ్మను తీసి ఇచ్చాడు. నీటిలో వేసిన బొమ్మ అలాగే ఉంది, నీరు కూడా అలాగే శుభ్రంగా ఉంది అన్నాడు. అప్పుడు గురువు గారు దీని నీతిని వివరిస్తూ, సమాజంలో ఇంకొందరు ఉంటారు. వీరి వల్ల సమాజానికి ఎటువంటి ప్రయోజనం ఉండదు. వీళ్ళు సమాజానికి మేలు చెయ్యరు, కీడు





చెయ్యరు. ఇటువటి వారి వల్ల సమాజానికి ఏరకమైన ప్రయోజనం ఉండదు, వీళ్ళు ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే అని వివరించాడు. మూడో శిష్యుడుని నీ బొమ్మ తియ్యమని చెప్పడంతో అతను బొమ్మ లేదు కరిగి పోయిది గురువుగారు అన్నాడు. ఆ నీటిని రుచి చూడమని చెప్పాడు గురువుగారు. నీరు తియ్యగా ఉన్నదని అన్నాడా శిష్యుడు. ఇప్పుడు ఆ నీటిని అందరికీ పంచమన్నాడు. నీరు తాగిన శిష్యులందరూ తియ్యగా ఉందన్నాడు. ఇలాంటి వ్యక్తులు కొందరు ఉంటారు. వీరు తాము కరుగుతూ సమాజానికి కూడా తమలోని తీపి గుణాన్ని అంటే మంచిని పంచుతారు. ఇటువంటి వారు సమాజానికి చాలా అవసరం అన్నారు. ఆ నీతి కథ విన్న యాత్రీకులు చాలా ఆనందానికి గురయ్యారు.

దారిలో గణేశం గారు ఇన్నోవేటర్ల కథలను, వారి ఇన్నోవేషన్లను గురించి యాత్రీకులకు వివరిస్తూ నడక సాగింది. దారిలో ఒకచోట తాటి చెట్లను రావి చెట్లు చుట్టుకొని ఉండటం గమనించి, దీని గురించి వివరించమన్నాడు గణేశం గారు. అందుకు జాజి, మనలాగే చెట్లు కూడా ఒకదానినొకటి ఆలింగనం చేసుకుని జీవిస్తుంటాయి. సాధారణంగా దేవాలయాల్లో అందుకే వేపచెట్టు, రావి చెట్టు వేస్తూ ఉంటారు. వేపచెట్టును రావిచెట్టు పెనవేసుకు పోయి పెరుగుతుంది. కొంత కాలానికి ఆ రెండు ఒకటే అన్నంతగా అతుక్కు పోయి ఉంటాయి వాటి మొదళ్ళు అన్నాడు.

దారిలో ఎక్కువగా నిమ్మతోటలు, కోళ్ళ ఫారాలు కనిపించాయి అలా నడుచుకుంటూ చివరి గమ్యమైన యం.జి. విశ్వవిద్యాలయం చేరుకున్నాము. అక్కడ అందరం యాత్ర గురించిన వివరాలను, అనుభవాలను ఒకరికొకరం పంచుకున్నాము. నా అనుభవాన్ని పంచుకోవడంతో పాటు, ఈ యాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరు కనీసం నెలలో ఒక్కరోజైనా 'పల్లెసృజన' గురించి ఆలోచించండి. మట్టిలో మాణిక్యాలను వెలుగులోకి తెచ్చే మరో మాణిక్యమే ఈ పల్లెసృజన. ఈ సంస్థ ఎప్పుడూ ప్రచారాన్ని కోరుకోదు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో దీనికి ప్రచారం కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ఇలాంటి సంస్థ లేకుంటే మరుగున పడివున్న జ్ఞానాన్ని వెలుగులోకి తెచ్చే మార్గమే లేదు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ నేనే. ఎక్కడో అడవుల్లో వుండే నన్ను ఈరోజు ఒక రాష్ట్రానికి 'సలహాదారుడు'గా చేసిన ఘనత కేవలం పల్లెసృజనదే అనటంతో అందరూ అతన్ని చప్పట్లతో అభినందించారు. ఆ తర్వాత వారు ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమాలను ముగించుకుని ఎవరి స్వస్థలాలకు వాళ్ళు బయలుదేరటం జరిగింది.

అందరికీ నమస్కారం నా పేరు **బాలాజీ.**

ఈ శోధయాత్రకు నేను వచ్చేటపుడు ఇది సాధారణ ప్రయాణమే అనుకున్నాను. కానీ ఇప్పుడు నాకు స్పష్టంగా తెలిసింది – ఇది నా జీవితంలో ఒక మరిచిపోలేని అనుభవం అని. మొదటిరోజు భయంతో ఉన్న నేను, ఇక్కడికి వచ్చాక సేంద్రియ పంటలు, గ్రామ జీవనం, రైతుల కష్టాలు అన్నీ ప్రత్యక్షంగా తెలుసుకున్నాను. ఈ అనుభవం నా ఆలోచన





లను పూర్తిగా మార్చింది.

చిన్న శోధయాత్రలో లింగం, వయస్సు అనే తేడా లేకుండా అందరికీ ఇచ్చే గౌరవం నాకు ప్రత్యేకంగా అనిపించింది. తొలిసారి నేను బాధ్యతగల వ్యక్తినని, అవసరమైన వాడినని అనిపించింది. నన్ను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా బ్రిగేడియర్ సర్‌కి మరియు మోహన్ సర్‌కి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఇది ముగింపు కాదు, ఒక ఆరంభం మాత్రమే. మళ్ళీ తప్పకుండా చిన్న శోధయాత్రకు వస్తాను. ఈ అనుభవాన్ని, మీ అందరినీ నేను ఎప్పటికీ మర్చిపోలేను. ధన్యవాదాలు.

**ప్రమీల స్పందన : వినియోగం నుంచి సరక్షణ వైపు**

ఇది మరో సాధారణ ప్రయాణం కాదు, నిజంగా చెప్పాలంటే జీవితంలో ఒక్కసారే దక్కే అనుభవం. ప్రకృతి సౌందర్యాన్ని అన్వేషిస్తూ నేను ఎన్నో ప్రాంతాలు తిరిగాను – స్వచ్ఛమైన గాలి పీల్చేందుకు, మనసును పునరుత్తేజింప జేసుకోవడానికి, అన్వేషణ ద్వారా కలిగే సాధించిన భావాన్ని ఆస్వాదించడానికి. కానీ ఇప్పుడు వెనక్కి చూసుకుంటే, అది ఎప్పుడూ ప్రకృతిని వినియోగించుకోవడమే తప్ప దాన్ని సంరక్షించాలనే ఆలోచన లేకుండానే సాగింది. అది అంతా "నేను" చుట్టూనే తిరిగింది.

**ఈ ప్రయాణంలో నన్ను గాఢంగా కదిలించిన అంశాలు ఇవి :**

ప్రకృతి ప్రతిదాన్ని ఒక లక్ష్యంతోనే సృష్టిస్తుంది – దుమ్ములోని ఒక రేణువును కూడా. అప్పుడు ఏ మొక్కను వ్యర్థమని ఎలా అనగలం? అది వ్యర్థం కాదు, కేవలం సరైన స్థానం దొరకక వేచివున్నదేమో; దాని ప్రయోజనాన్ని వెలికి తీసే చేతుల కోసం ఎదురు చూస్తోంది. ఆ చేతులను నేను చూశాను. నా చుట్టూ వున్న ఔషధ మొక్కల అపార సంపదను తెలుసుకున్నప్పుడు ధన్యురాలినైపోయాను అనే భావన కలిగింది.

నా సహ యాత్రికులను మొదటిసారే కలిసినా, ఎన్నాళ్ళ నుంచో తెలిసిన వారిలా అనిపించింది. ప్రతి ఒక్కరూ జీవితం, జీవన విధానంపై తమదైన విలువైన అనభవాలను పంచుకున్నారు. ప్రయాణాన్ని "నేను" అనే భావాన్ని శూన్యంగా చేసుకోవడం ద్వారా ప్రారంభించడం – జ్ఞానం, వినయం పొందడానికి ఒక ప్రయాణంలా మారింది. గ్రామాలు, గ్రామస్తులు, వారి దృష్టి కోణాలు, వారి సరళ జీవనం, వారి పోరాటాలు, పరిష్కారాలు ..... ఇవన్నీ నన్ను స్వార్థపు ఆలోచనల నుంచి దూరం చేసి, సమాజం గురించి ఆలోచించేట్లుగా ప్రేరేప చేశాయి.

అన్నిటికన్నా ముఖ్యంగా పల్లెసృజన మరియు అది సమాజానికి చేస్తున్న నిస్వార్థ సేవ గురించి తెలుసుకోవడం నాకు అపారమైన ఆనందాన్ని, ఆశను నింపింది.

**అరుణ్ తేజ స్పందన : వినూత్నత నాకు చూపిన కొత్త దారి ....**

ఈ యాత్ర ఒక సాధారణ ప్రయాణం కాదు. ఇది ఆలోచనల యాత్ర. నేను కలిసిన ప్రతి వ్యక్తి ఒక పుస్తకం లాంటివారు. మూడు రోజుల ఈ జ్ఞాన ప్రయాణంలో నేను నేర్చుకున్నది, నా ఆలోచనలను పూర్తిగా మార్చేసింది.

ఈ యాత్రకు ముందు ఇన్నోవేటర్లు ఎందుకు వెలుగులోకి రావాలి? పల్లెసృజన ఎందుకు అవసరం? అనే సందేహం నాకుండేది. కానీ యాత్ర పూర్తయ్యాక ఒక నిజం అర్థమైంది – అధిక భాగం ఆవిష్కరణలు బాధ నుంచే వపుడతాయి. నిజమైన ఇన్నోవేటర్ సమస్యను కేవలం చూడడు, దాన్ని అనుభవిస్తాడు. అందుకే వారి పరిష్కారాలు నిజంగా పని చేస్తాయి.

కానీ ఒక కఠిన సత్యం కూడా తెలుసుకున్నాను – ఇన్నోవేటర్లకు గుర్తింపు లేకపోతే, వారి ఆలోచనలను ఇతరులు స్వాధీనం



చేనుకుంటారు. అప్పుడు ప్రజల కష్టాలకంటే లాభాలే ముఖ్యమవుతాయి. ఆదాయం కనిపిస్తుంది, ఉపశమనం కాదు. అభివృద్ధి కనిపిస్తుంది – గౌరవం కాదు. అటువంటి పరిస్థితుల్లో, పునాది స్థాయి ఇన్నోవేటర్లకు స్వరం అవసరం. ఆ స్వరమే 'పల్లెసృజన'.

ఈ ప్రయాణంలో ఒక సంఘటన నా మనసును గాఢంగా కదిలించింది. 80 ఏళ్లకు పైగా వయసున్న ఒక అమ్మమ్మ తన జీవిత అనుభవాలను ఎంతో ప్రేమతో మాతో పంచుకుంది. కానీ అకస్మాత్తుగా ఆమె మనవడు ఆమెను మందలించడంతో, ఆమె భయంతో మౌనంగా వెళ్లిపోయింది. ఆ క్షణంలో మేము ఆమె పక్షాన నిలబడలేదు – అదే మా తప్పు. తర్వాత మా తప్పును గ్రహించి మళ్లీ వెళ్ళి ఆమెను గౌరవించాము. అప్పుడు ఆమె కళ్ళల్లో కనిపించిన ఆనందం, గర్వం నాకు జీవితాంతం గుర్తుంటుంది.

ఆరోజు నేను నేర్చుకున్న పాఠం స్పష్టం : – తప్పు చేస్తే, వీలైనంత త్వరగా దాన్ని సరిదిద్దుకోవాలి. – మనతో నిలబడిన వారికోసం మనం కూడా నిలబడాలి.

గ్రామాల్లో నేను చూసిన మహిళలు నాకు నిజమైన ప్రేరణ. పొలాల్లో కష్టాపడుతూ, ఇంటిని నడిపిస్తూ, శారీరకంగా మరియు మానసికంగా బలంగా ఉన్నారు. వారి దగ్గర ఎన్నో పరిష్కారాలు ఉన్నాయి. కానీ అవి "ఆవిష్కణలు" గుర్తిపు పొందడం లేదు. నిజానికి అత్యంత శక్తివంతమైన ఆవిష్కరణలు మౌనంగా పుడతాయి.

ప్రకృతి దగ్గర దాదాపు ప్రతి సమస్యకు పరిష్కారం ఉంది. కానీ మనం ఆ జ్ఞానాన్ని గౌరవించడం మర్చిపోయాం. ఈ యాత్రలో మొక్కలను కేవలం చదవలేదు – వాటిని తాకాము, అనుభవించాము, అర్థ చేసుకున్నాము. వేగంగా పెరిగే ఆహారం, ఔషధాల వెనుక ఉన్న అనారోగ్యాన్ని కూడా గమనించాము.

15 ఏళ్ల చదువులో కూడా ఆహారం, మొక్కలు, ఆరోగ్యం, ప్రకృతి – ఇవేవీ మాకు సరిగ్గా నేర్పలేదు అనే నిజం బాధ కలిగించింది. చిన్న వయసులోనే పిల్లలకు తమచుట్టూ ఉన్న మొక్కల విలువలు చెప్పగలిగితే, అది భవిష్యత్తును నిజంగా మార్చగలదు.

ఈ యాత్ర నాకు చెప్పన ఒక గొప్ప సత్యం "ప్రకృతే చికిత్సను ఇస్తుంది – మనమే దాన్ని నేర్చుకోవడం మర్చిపోతున్నాం".

**ఏదూరి శ్రీవల్లి స్పందన : స్పష్టత నుంచి సందేహాల దాకా.....**

ఇది నా రెండవ చిన్న శోధయాత్ర. మొదటి యాత్ర నాకు ఆత్మ పరిచయం, స్పష్టత ఇచ్చింది. కానీ ఈసారి యాత్ర స్పష్టతతో కాకుండా సందేహాలతో ప్రారంభమైంది. సమాధానాల కోసం కాదు, "ఎందుకు?", "ఎవరికి?" అనే ప్రశ్నలతో ఈ ప్రయాణం సాగింది.





యాత్ర మొదలవకముందే ప్లాస్టిక్ సీసాలు, కవర్లను ఏరుకుంటున్న ఒక వృద్ధుడిని కలవడం నన్ను తీవ్రంగా కదిలించింది. సమాజానికి విలువైన సేవ అందిస్తున్న అతను గౌరవాన్ని కూడా స్వీకరించలేని స్థితిలో ఉండడం మన వినియోగ సంస్కృతిపై ప్రశ్నగా నిలిచింది.

గ్రామాల్లో ప్రజల ఆశయాలు రెండు మార్గాలకు మాత్రమే పరిమితం కావడం – డాక్టర్ లేదా కలెక్టర్ అని గమనించాను. ఇది పిల్లల సృజనాత్మకను అన్వేషణను ఆరంభంలోనే అణచి వేస్తోంది. పత్తి కర్మాగారంలో జరిగిన సంభాషణలు మనం ఆధారపడే తరాలను తయారు చేస్తున్నామనే వాస్తవాన్ని మరింత స్పష్టం చేశాయి.

గ్రామ మహిళల అనుభవాలు నాకు 'ప్రివిలేజ్' అంటే సంపద కాదు, "కలలు గనే స్వేచ్ఛ" అని అర్థమయ్యేలా చేశాయి. వృద్ధులు తమ జీవన జ్ఞానానికి విలువ లేదనుకోవడం అభివృద్ధిని మనం ఎలా నిర్వచిస్తున్నామో ప్రశ్నించింది.

ఈ శోధయాత్ర నాకు తక్షణ సమాధానాలు ఇవ్వలేదు. బదులుగా నన్ను మళ్ళీ శూన్య స్థితికి తీసుకు వచ్చింది. నా జీవితం విజయాల పరంపర కాదని, ఎంపికల పరంపర అని గ్రహించాను. ప్రవాహంతో పాటు పోతున్నానా, లేక ఉద్దేశ్యంతో జీవిస్తున్నానా? అనే ప్రశ్నతోనే ఈ యాత్ర ముగిసింది. ఈ సందేహాలే ఇప్పుడు నాకు సరైన దారిని చూపిస్తున్నాయి.

**ఈ ఐదుగురి అనుభవాలు ఒకే యాత్రను నాలుగు విభిన్న కోణాలను చూపిస్తున్నాయి. మొదట సరదాగా లేదా స్పష్టతతో ప్రారంభమైన ప్రయాణం, క్రమంగా లోతైన ఆత్మపరిశీలనగా, ప్రశ్నలుగా, బాధ్యతగా మారింది. గ్రామ జీవనం, ప్రకృతి, ఇన్నోవేటర్లు, మహిళలు, వృద్ధులు – వీరందరూ ఈ యాత్రలో కేవలం చూసిన వ్యక్తులు కాదు; యాత్రీకుల ఆలోచనలను కదిలించిన జీవిత గురువులుగా మారారు. వినియోగం నుంచి సంరక్షణ వైపు, చూసే దృష్టి నుంచి ఆలోచించే దశకు, "నేను" నుంచి "మనము" వైపు ఈ ప్రయాణం వారిని నడిపించింది.**

**ఈ స్పందనలన్నింటిలోను సాధారణంగా కనిపించే సత్యం ఒక్కటే – శోధయాత్ర ప్రశ్నలు వేయిస్తుంది. ఆ ప్రశ్నల వ్యక్తిని శూన్య స్థితికి తీసుకెళ్ళి, బాధ్యతగల పౌరుడిగా, సున్నితమై న మనిషిగా మారే దారిని చూపిస్తాయి. ఇదే శోధయాత్ర సారాంశం; ఇదే చిన్న శోధయాత్ర అసలైన విజయం. ఈ యాత్రీకులే భవిష్యత్తులో అద్భుతమైన పౌరులుగా తమ బాధ్యతలను నిర్వహిస్తారు. – ఎడిటర్**

# గ్రామీణ రవాణా కొరకు 2 మోటార్ సైకిల్ ట్రాలీలు తయారు చేసిన మహిపాల్ చారి




మొట్టమొదటిసారిగా ట్రాక్టర్లకు పర్యాయంగా చిన్న, సన్నకారు రైతుల కొరకు నడుపుకుంటూ పొలంలో కలుపు తీసేందుకు, మిర్చి, పత్తి చేలలో అంతర సేద్యాలు చేసుకునేందుకు వీలుగా 'పవర్ వీడర్'ను తయారు చేసిన తెలంగాణ లోని హన్మకొండ జిల్లా, పరకాలకు చెందిన 'కడివెండి మహిపాల్ చారి' విషయం పాఠకులకు విదితమే.

నిరంతరం రైతులకు వ్యవసాయంలో ఇంకాస్త ఎక్కువ మిగలాలి అంటే ముందుగా చెయ్యాల్సిన పని పెట్టుబడి ఖర్చులు తగ్గించాలి అన్న ఉద్దేశ్యంతో మొదటి నుండి తన ఇన్నోవేషన్లను గ్రామాలకు ఉపయోగ పడేవిగాధంగానే ఉంటున్నాయి.

ఇందులో భాగంగా తాను గ్రామంలో ఉండి గమనించిన రైతుల కష్టాలలో 'గ్రామీణ రవాణా' ఒకటని గుర్తించాడు. రైతులు ఇంటి నుండి పొలానికి ఎరువు సంచులు, ఇతర సామాగ్రి, కూలీలను తరలించడం లాంటి పనులు, పొలం నుండి ఇంటికి వచ్చేటపుడు ఇంటికి చేర్చాల్సిన వ్యవసాయ దిగుబడులకు ఎద్దుబండ్లు, ట్రాక్టర్లు, కిరాయి ఆటోల పైననే ఎక్కువగా ఆధారపడుతన్నారని గ్రహించాడు. అదే సమయంలో రైతులలో చాలా మందికి మోటార్ సైకిల్ ఉఉంది, కానీ ప్రతిదీ మోటార్ సైకిల్పైన తీసుకు వెళ్ళలేరు అన్న విషయం గ్రహించాడు.

ఈ సమస్య పరిష్కారానికి రైతులు తమ మోటార్ సైకిల్నే ఎద్దుల బండిగా, ఆటోగా, మినీ ట్రాక్టరుగా ఉపయోగించుకునేలా రైతు సామర్థ్యాన్ని, అవసరాన్ని బట్టి రెండు రకాల ట్రాలీలను తయారు చేశాడు. ప్రస్తుతం ఈ ట్రాలీ ద్వారా ఆ పరిసర గ్రామాల్లో చాలా మంది రైతులు ఈ ట్రాలీని కొనుగోలు చేసి, పొలాలకు కూలీలను ఎటువంటి కిరాయి లేకుండా, తమ మోటార్ సైకిళ్ళతోనే తరలిస్తున్నారు, తిరిగి పని అయిపోయిన తర్వత వారిని ఇంటికి చేరుస్తున్నారు. అలాగే పొలానికి అవసరమైన ఎరువులు, పురుగు మందులు పిచికారి చేసుకునేందుకు అవసరమైన పంపు, నీటి డ్రమ్ములు లాంటి వాటిని కూడా సునాయాసంగా చేరవేసుకుంటున్నారు. అలాగే పొలం లో పండిన ఏవైనా వ్యవసాయ దిగుబడులను ఇంటికి చేర్చుకుంటున్నారు.

ఆటో లేదా ట్రాక్టరు కిరాయికి రావటం కోసం ఎదురు చూడటం లాంటి అవసరం లేకుండా తమ మోటార్ సైకిల్నే తమ రవాణా వాహనంగా తయారు చేసుకుని ఆనందంగా తమ పనులు చేసుకుంటున్నారు. మోటార్ సైకిల్పైన అవసరమైనంత వేగంతో, ఎటువంటి కుదుపులు, క్రింద పడతామేమో నన్న భయం ఏమాత్రం లేకుండా చాలా చక్కగా తయారు చేశాడని రైతులు ఇన్నోవేటర్ మహిపాల్ చారిని ప్రశంసిస్తున్నారు. రైతు అవసరాన్ని బట్టి రెండు రకాల ట్రాలీలు చేయటానికి కారణం అందరు రైతులు ఒకే స్థోమత కలిగి ఉండరు కాబట్టి 5 అడుగుల పొడవు,3 అడుగుల వెడల్పు, 1 అడుగు ఎత్తు గల పెద్ద ట్రాలీ ఒకటి చేశాడు, అలాగే 29 అంగుళాల పొడవు, 28 అంగుళాల వెడల్పు, 17 అంగుళాల ఎత్తు గల చిన్న ట్రాలీ ఒకటి తయారు చేశాడు.

ఈ ట్రాలీ మోటార్ సైకిల్కు ఎప్పుడూ తగిలించుకుని ఉండాల్సిన అవసరం లేదు. అవసరమైనప్పుడు బిగించుకుని, అవసరం లేనపుడు తీసివేయొచ్చు. చాలా సులభంగా బిగించుకోవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో లభించే ట్రాలీలన్నీ మోటార్ సైకిల్ వెనక చక్రం యొక్క ఇరుసు వద్ద తగిలించుకునే విధంగా ఉన్నాయి. ట్రాలీ తగిలించుకోవాల్సిన ప్రతిసారి ఆ వెనక చక్రం ఇరుసుకు వున్న నట్ బోల్టాలను విడదీని తగిలించుకోవటం వల్ల మళ్ళీ ట్రాలీ తీసిన తర్వాత వాటిని సరిగ్గా బిగించకుంటే మోటార్ సైకిల్ను ఉపయోగించుకునేటపుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి మహిపాల్ చారి ఈ ట్రాలీని మనిషి కూర్చునే సీటు వెనకాల తగిలించుకునే విధంగా చాలా సులభంగా ఎవరైనా తగిలించుకునే విధంగా తయారు చేయటం వల్ల దీన్ని ఉపయోగించుకునేటప్పుడు గ్రామస్తులు ఎటువంటి భయం, బెరుకు లేకుండా తమ మోటారు సైకిల్కు ట్రాలీని తగిలించుకుని తమ పనులను ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా చేసుకుంటున్నారు. రైతులకు ఎంతో సులభమైన గ్రామీణ రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేసిన మహిపాల్ చారిని 'పల్లెసృజన' అభినందనలు తెలియజేస్తోంది.

**ఇన్నోవేటర్ మహిపాల్ చారి, ఫోన్ : 98669 22168**





# పీపుల్స్ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్

## 2వ ఇన్నోవేషన్ ఉత్సవాలు - కొత్త ఢిల్లీ



- 'హనీబీ' ఆంగ్ల సంచిక సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

**కొత్త ఢిల్లీలోని ఐఐసి ఇండియా ఇంటర్‌నేషనల్ సెంటర్‌లో 2023 నవంబరు 28 నుండి డిసెంబర్ 2 వరకు జరిగిన రెండవ ఇన్నోవేషన్ ఉత్సవాలలో పాల్గొన్న ఇన్నోవేషన్‌ల సంక్షిప్త వివరాలు, జాతీయ స్థాయిలో జరిగే ఈ ఉత్సవంలో పాల్గొనటమే గొప్పగా భావిస్తారు ఇన్నోవేటర్లు. - ఎడిటర్**

### మధుమేహ (చక్కెర) వ్యాధిగ్రస్తుల గాయాలు నయం చేయటానికి మూలికా వైద్యం:



**హకీన్ నజీర్ అహ్మద్,** అనంతనాగ్, జమ్ము & కాశ్మీర్.

**సమస్య:** పర్వత ప్రాంతాల్లోని మారుమూల ప్రదేశాల్లో నివసించే ప్రజలకి ఆధునిక వైద్య వసతులు లేని కారణంగా సాంప్రదాయ వైద్యమే తప్పనిసరిగా వాడాల్సి వస్తుంది. జమ్మూ కాశ్మీర్‌కి చెందిన, అనంతనాగ్ ప్రాంత వాసి అయిన నజీర్ అహ్మద్ సాంప్రదాయ వైద్యం చేస్తూ ఉంటాడు. ఈ వైద్యం చేసే క్రమంలో ఆయనకి తరచూ మధుమేహ వ్యాధిగ్రస్తులు తమకి తగిలిన వివిధ రకాల గాయాలు, పుండ్లు నయం కాక, ఆధునిక వైద్య సదుపాయాలు లేక మా ఖర్మ ఇంతే అని బాధను భరిస్తూ ఉండేవారిని అనేక మందిని చూశాడు. వీరికి ఏదైనా ఒక మార్గం చూపించాలని ఆలోచించాడు.

**పరిష్కారం:** తనకు తెలిసిన మూలికా వైద్య పరిజ్ఞానంతో మధుమేహ వ్యాధి గ్రస్తులకి సోకిన గాయాలని, దెబ్బలని నయం చేయడానికి అనేక లేపనాలు, మందులు తయారు చేశాడు.

వీడియో కొరకు స్కాన్ చెయ్యండి

**సమాజంపై ప్రభావం:** నజీర్ అహ్మద్ మార్కెట్‌లో లభించే ఆధునిక ఆయింట్‌మెంట్లు అయిన 'సఫ్రోమైసిన్' ఇతర సల్ఫేట్ ఆధారిత ఆయింట్‌మెంట్‌ల కన్నా తాను తయారు చేసిన లేపనాలు బాగా పని చేస్తున్నాయని, గాయాలు త్వరగా నయం అవుతున్నాయని తెలిపారు. సాధారణ వ్యక్తులకి అయిన గాయాలు కేవలం 5-10 రోజులలోనే నయం అవుతున్నాయని చెప్పారు. తాను తన ఇంట్లోనుంచే కాక, కుల్‌గాం లోని యునాని ఆసుపత్రుల నుండి కూడా వైద్యం చేస్తున్నానని, తాను కేవలం మందులు తయారు చేయటానికి అయిన ఖర్చులు మాత్రమే తీసుకుంటానని, పర్యవసానంగా చాలా మంది రోగులు తనవద్దకు వచ్చే అవకాశం కల్పిస్తున్నానని చెప్పారు.

**ప్రస్తుత పరిస్థితి:** ఈ రకమైన మందులకి సంబంధించిన పేటెంటు వివరాలు పరిశీలించిన తర్వాత ఈయన తయారు చేసిన మందులు చాలా ప్రత్యేకమైనవి అని ఋజువైనది. ఆనంద్ ఫార్మసీ కళాశాలలో జరిపిన ప్రత్యేక పరీక్షల ద్వారా ఇతను తయారు చేసిన మందులకి త్వరగా దెబ్బలను నయం చేసే గుణం ఉందని ఋజువైంది. పేటెంటు కొరకు అవసరమైన ఇతర పరీక్షలు కొనసాగుతున్నాయి. 'జిఐఎఎన్' (గియాన్) సంస్థ సహాయంతో తన మందులని ఇంకా సమర్థవంతంగా పని చేసేలా ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రభుత్వం సహాయం చేస్తే బాగుంటుందని ఆశిస్తున్నాడు.

### మూలికా వైద్యం:



**అభికేసర్ ఖతివార,** గ్యాల్‌సింగ్, సిక్కిం.

**సమస్య:** అభికేసర్ చాలా సంవత్సరాల నుంచి తన

గ్రామంలో మూలికా వైద్యం చేస్తూ ఉన్నాడు. ఈ క్రమంలో అతను ఆధునిక వైద్య పద్ధతులలో వాడే మందులు అలవాటైపోయే ప్రమాదమో, వాటివల్ల దుష్ప్రభావాలు కలిగించే అనేక రసాయనాలు కలిగి ఉండటం గమనించాడు. అయినా సరే ప్రజలు సరైన ప్రత్యామ్నాయం లేక సుదూర ప్రాంతాలకు కూడా వెళ్ళి ఖరీదైన పాశ్చాత్య మందులనే వాడటం చూసి, దీనికి ఏమైనా సులభంగా స్థానిక మూలికలు వాడవచ్చునేమో అని అనేక ప్రయత్నాలు చేసి, అనేక కొత్తరకం మందులను రూపొందించాడు.

వీడియో కొరకు స్కాన్ చెయ్యండి

**పరిష్కారం:** ఈయన వైద్యము స్థానికంగా దొరికే మూలికలను, వేళ్ళను, కాయలను ఎండబెట్టి, పొడిచేసి లేదా ద్రావకంగా చేసి అనేక రకాల ఆయుర్వేద మందులను రూపొందించాడు. ఈయన ప్రత్యేకత ఏమిటంటే ప్రతి రోగికి అతని రోగ లక్షణాల ఆధారంగా వేరువేరు మందులను తయారు చేసి ఇవ్వటం.

**సమాజంపై ప్రభావం :** ఈయన వద్దకు రకరకాల రోగులు వస్తూ ఉంటారు. వారిలో ఉదర సంబంధ వ్యాధులు, రక్తవపోటు, మధుమేహము, అల్సర్ మొదలున వారు ఉంటారు. వీరే కాక ఈయన ప్రత్యేకించి మూలశంక, నిమోనియా, బంగ్లా బిమారి (కళ్ళు ఎర్రబడి నీరు కారటం) మొదలైన అనేక సాధారణ జబ్బులకి మందులు తయారు చేశాడు. తాను తయారు చేసిన మూలశంక మరియు మధుమేహ వ్యాధి మందులు ఇతర అన్ని రకాల మందులకన్నా బాగా పని చేస్తాయని చెప్పారు. ఈయన మందులు ఎంతటి ప్రాచుర్యం పొందాయంటే.... సౌదీ అరేబియా ప్రభుత్వం ఈయనని తమ దేశానికి వచ్చి ఒక సంవత్సరం పాటు స్థానిక వైద్యులకి ఈయన వైద్య విధానంలో శిక్షణ ఇవ్వటమే కాక, ఈయన ఆ మందులకు అవసరమైన మూలికలను ఏవిధంగా పెంచాలో కూడా శిక్షణ ఇమ్మడి కోరి, తీసుకుని వెళ్ళారు.

**ప్రస్తుత పరిస్థితి :** ఈయన తన తండ్రి తయారు చేసిన 108 రకాల మందులకి, తాను తయారు చేసినవి కూడా జోడించి వైద్యంలో 70 శాతం ఫలితాలు సాధిస్తున్నాడు. ఇతను ఏవిధమైన వైద్య శిక్షణ పొందకపోయినా, మూలికలను పండించటము, తర్వాత వాటిని మందులుగా తయారు చెయ్యటము, సేంద్రియ వ్యవసాయము, పుట్టగొడుగుల పెంపకం మొదలైన అంశాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇతనికి ప్రత్యేక అనుమతిని ఇచ్చి కితాబునిచ్చింది. జిఐఎఎన్ (గియాన్) సంస్థతో కలిసి ఈయన కొన్ని స్వయం సహాయక బృందాలకు ఫుడ్ టెక్నాలజీస్ట్ గా వ్యవహరిస్తున్నాడు. 2023లో ఈ స్వయం సహాయక బృందాలు తయారు చేసిన పదార్థాలు 'పిక్‌జుక్' పేరిట నిర్ణయించిన సాంప్రదాయ ఆహార పదార్థాలు మరియు కళల ఉత్సవంలో ప్రదర్శించినపుడు అందరి మన్ననలు పొందాయి.



## జొన్నలు విసిరే మరియు పొడి చేసే మినీ యంత్రం:

**పంతాంగ్,** కిఫైర్, నాగాలాండ్



**సమస్య:** చాలామంది సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయ పనులలో తమ శ్రమను తగ్గించడం కోసం పెద్ద యంత్రాలను కొనలేరు సరికదా, తమ కనీస శ్రమను తీర్చే చిన్న యంత్రాలను కూడా కొనలేని పరిస్థితుల్లో ఉన్నారు. పెద్ద యంత్రాలన్నీ కూడా వారి అవసరానికి ఎక్కువైన సామర్థ్యం కలిగి వుండి చాలా ఖరీదుతో కూడుకున్నవే కాక, ఎక్కువ ఇంధనం ఖర్చవుతుంది.

వీడియో కొరకు స్కాన్ చెయ్యండి

**పరిష్కారం :** వారి శ్రమను తగ్గించడం కోసం ఇన్నోవేటర్ పంతాంగ్ ఈ యంత్రాన్ని కనుగొన్నాడు. అది మనం సాధారణంగా పిండి గిర్నీలలో పప్పులని విసిరి రవ్వ, పిండి చెయ్యటమే కాకుండా మన మిక్సర్ లాగా పూర్తి పిండిగా కూడా చేస్తుంది. విసిరే ప్రక్రియలో జొన్నలని రవ్వలాగా చేసి, జల్లిస్తుంది కూడా. మిక్సరు విడిగా చిరు ధాన్యాలని, బియ్యాన్ని, గోధుమలను



పిండిగా చేసి ఇస్తుంది. ఈ యంత్రాలు 1 హార్స్‌పవర్ మోటార్‌తో 15 నిమిషాలలో 50 కిలోల వరకు పిండి/రవ చేసి ఇస్తాయి.

**సమాజంపై ప్రభావం:** ఇన్నోవేటర్ చెప్పినదాని ప్రకారం ఈ యంత్రాలు తయారైన తర్వాత బజార్లోని పెద్ద యంత్రాల జోలికి వెళ్ళకుండా ఎక్కడికైనా సులభంగా తీసుకుని వెళ్ళగలిగే ఈ చిన్న యంత్రాలు వాడటం మొదలు పెట్టారు. ఇప్పటి వరకు సుమారు 200 కుటుంబాలు వీటివల్ల లాభపడ్డారు.



**ప్రస్తుత పరిస్థితి:** ఇన్నోవేటర్ ఇచ్చిన వివరాల ప్రకారం ఇప్పటి వరకు 22 గ్రైండర్లు, 18 మిక్సర్లు విక్రయించాడు. జిఐఎఎన్ (గియాన్) సంస్థ వారు దీని డిజైన్ మొదలైన సాంకేతిక సహాయం అందజేస్తోంది. ఎక్కువ సంఖ్యలో యంత్రాలను తయారు చెయ్యటానికి మూలధన సేకరణలో కూడా సహకరిస్తోంది.

వీడియో కొరకు స్కాన్ చెయ్యండి

## అనాస తోలు తీసే యంత్రం:

**ఇంకాంగ్ సునివ్,** మొకోక్‌చుంగ్, నాగాలాండ్.

**సమస్య:** నాగాలాండ్ లో చాలా కుటుంబాలు పండ్ల తోటల పెంపకంపైన ఆధారపడి ఉంటా యి. వారు పళ్ళకి సమర్థవంతమైన యంత్రాలు మరియు పనిముట్లు లేని కారణంగా చెక్కు తీసి ముక్కలుగా చేయడం లేదా రసం తీయడం లాంటి పనులు చేతులతోనే చేసి, తమ స్వంత వాడకానికి గాని, ఇంధనంగా వాడటానికి గాని కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటారు.

**పరిష్కారం:** పళ్ళ పరిశ్రమకి అనువైన యంత్రాలు లేకపోవటం గమనించిన ఇన్నోవేటర్ ఇంకాంగ్ సునివ్ ఒక చిన్న లేత్ మిషన్ లాంటి యంత్రంలో అనాస పండును పెట్టి, సవరించుకోవడానికి వీలుగా ఒక బ్లేడును ఏర్పాటు చేసి, పండు తిరుగుతూ ఉంటే కదిలే బ్లేడు సహాయంతో అనాస పండు తొక్క తీసేలా ఏర్పాటు చేశాడు. ఇంతకు ముందు ఇతను పెండలం తోలు తీయటానికి సుమారు ఇటువంటి యంత్రాన్ని తయారు చేసినపుడు అనేక రకాల బ్లేడులను వాడి, నాగాలాండ్ ప్రభుత్వ ఉద్యానశాఖ దృష్టిలో పడ్డాడు. వారి సూచనతోనే ఇతను ఈ యంత్రాన్ని రూపొందించాడు. కాకపోతే పెండలం కొరకు తయారు చేసిన యంత్రం వెదురు, ఇతర రకాల దుంపలకు కూడా పని చేస్తుంది.



**సమాజంపై ప్రభావం:** ఇతను ఇటువంటి యంత్రం తయారు చేశాడు అని తెలుసుకున్న చాలామంది సామాజిక మీడియాలో చూసిన మరి కొందరు ఈ యంత్రాన్ని చూడటానికి వచ్చి, వాడటం కూడా నేర్చుకున్నారు. ఇన్నోవేటర్ చెప్పినదాని ప్రకారం తక్కువ ధరలో, చిన్నసైజులో ఉన్న ఇటువంటి యంత్రాల అవసరం సమాజానికి చాలా ఉన్నది. సాధారణంగా రోజుకి 2 క్వింటాళ్ళ అనాస పండ్ల చెక్కును తీసే స్థానంలో ఈ యంత్రం వాడితే 50 క్వింటాళ్ళ వరకు చెక్కును తీయవచ్చు.

**ప్రస్తుత పరిస్థితి:** 2015వ సంవత్సరంలో నాగాలాండ్ ప్రభుత్వ ఉద్యానవన శాఖ వారి సూచన మేరకు ఈ యంత్రంపై పని చెయ్యటం ప్రారంభించారు. 2023లో ఎన్ఐఎఫ్ వారు రాష్ట్రపతి భవన్‌లో సత్కరించబడ్డాడు. వారి సహాయంతోనే ఈ యంత్రం పేటెంట్‌కు కూడా దరఖాస్తు చేయటం జరిగింది. వృత్తిరీత్యా చర్చిలో పాస్టర్ అయిన ఇన్నోవేటర్ ఈ యంత్రాలను భారీ సంఖ్యలో ఎవరైనా తయారు చేయదలచుకుంటే డిజైన్ విషయంలో ఉచితంగా సహాయం చేస్తానని అంటున్నాడు.

## ఈ ఉత్సవాల్లో పాల్గొన్న తెలుగు ఇన్నోవేటర్లు

**కొడిముంజ ప్రవీణ్ -**
మల్బరీ మొక్కలను కత్తిరించి, కట్టలు కట్టే పరికరం.

**గోదాసు నర్సింహ -**
చెరువుల్లో 'గుర్రపుడెక్క' తీసివేసే యంత్రం.

**అల్లాడి ప్రభాకర్ -**
నడవలేని వ్యాధిగ్రస్తులకు పనికి వచ్చే మంచం.

**మోథా శివకుమార్ -**
చేనేతలో పెడల్ లిఫ్టింగ్ యంత్రం.

**శ్రీమతి దూబ రాజు -**
సహజ పంటలతో క్లీనింగ్ ద్రావణాలు.

**మెండె శ్రీనివాస్ -**
పొలాలకు, ఇళ్ళకు నీరు తోడేందుకు రోబో.

**నవంబర్-2025 న జరిగిన 4వ ఉత్సవంలో పాల్గొన్నావారు:**

**చింతకింది నరేందర్ -**
పోచంపల్లి నేతలో డజైన్‌మార్కింగ్ యంత్రం.

**షేక్ భాషా -**
మోటార్ సైకిల్‌కు వ్యవసాయ పరికరాల అమరిక.

**శ్రీనివాస రావు -**
చేపల చెరువుల్లో ఏరియేటర్.

# ఆయుర్వేద జ్ఞాన మథనం

## ఇంటో ఉన్న వస్తువులతోనే 'మన ఆరోగ్యం మన చేతుల్లో'



ఉమా మహేశ్వర రావు

ప్రజలను ముఖ్యంగా యువతను బాగా వేధిస్తున్న సమస్యల్లో 'చుండ్రు' ఒకటి. ఈ చుండ్రు నివారణకు 100 గ్రాముల మెంతులు తీసుకుని మెత్తటి పొడిగా చేసుకుని ఒక చెంచాడు పొడిని కొద్దిగా పెరుగు లేదా నిమ్మరసం లో రాత్రంతా నానబెట్టి, ఉదయమే తలకు అంటించుకుని ఒక గంట తర్వాత స్నానం చెయ్యాలి. లేదా పగలు నానబెట్టుకుని రాత్రిపూట తలకు అంటించుకుని, ఉదయమే స్నానం చెయ్యాలి. అలా 10 రోజులు చెయ్యగలిగితే చుండ్రు బాధ ఉండదు.

కొంతమందికి ముఖం జిడ్డు కారిపోతూ ఉంటుంది. ఈ సమస్య నివారణకు పెసలు కొన్ని తీసుకుని, రాత్రంతా నానబెట్టి, ఉదయమే అందులో కొద్దిగా కస్తూరి పసుపు వేసుకుని ముఖానికి రాసుకుని ఒక అరగంట తర్వాత స్నానం చెయ్యాలి. ఇలా 10 రోజుల పాటు చేసినట్లయితే ముఖంపై జిడ్డు కారటం ఆగిపోవటంతో పాటు, చిన్న చిన్న మచ్చలు లాంటివి ఏవైనా ఉంటే కూడా అవన్నీ నయమై పోతాయి.

గొంతు గరగర, నసతో బాధ పడుతున్న వారు ఈ చిన్న చిట్కాను ఉపయోగించినట్లయితే ఆ సమస్య నుండి బయట పడవచ్చు. మామిడి చెట్టు లేత ఆకులు లేదా లేత కొమ్మ కొనలు ఒకటి రెండు తీసుకుని నోట్లో వేసుకుని నమిలి రసం పీల్చి, పిప్పి పారవేస్తే చాలు. ఇలా ఒక వారం రోజులు చేసినట్లయితే గొంతు గరగర, నస పోవటంతో పాటు, గళ్ళ లాంటి సమస్యలు కూడా నయమైపోతాయి.

ముఖంపై మొటిమలు, మచ్చలు ఉన్న వారు మీకు సమీపంలో లభించే మర్రి చెట్టు లేత చిగురుటాకులు, శనగలు కొద్దిగా తీసుకుని రోట్లో వేసి మెత్తగా దంచి పేస్టులాగా తయారు చేసుకుని, దాన్ని ముఖానికి పూసుకుని ఒక గంట తర్వాత స్నానం చెయ్యాలి. ఇలా వారం – పది రోజుల పాటు చేసినట్లయితే ముఖంపైన వున్న మచ్చలు, మొటిమలు నయమైపోతాయి.

చాలా మంది కిడ్నీలో రాళ్ళు ఉన్నాయని తెలిసి భయపడి, డాక్టర్ల దగ్గరకు పరిగెడుతూ ఉంటారు. మనం పప్పు, చట్నీలకు ఉపయోగించే దోసకాయ (దీన్నేకొన్ని ప్రాంతాల్లో బుడంకాయ అంటారు). ఇది పసుపు పచ్చగా ఉంటుంది. దాన్ని మొత్తంగా తోలుతో సహా ముక్కలు చేసి, మిక్సీ పట్టుకుని, అందులో కొద్దిగా నీళ్ళు కలిపి, పొయ్యిపైన బాగా మరగబెట్టి, చల్లారిన తర్వాత ఆ రసాన్ని ఉదయం, సాయంత్రం సేవించినట్లయితే కిడ్నీలోని ఎంత లావు రాయైనా సరే కరిగి మలం లేదా మూత్రం ద్వారా బయటకు వస్తుంది.

కొంత మందికి పేను కొరుకుడు వల్ల చాలా ఇబ్బందికి గురవుతుంటారు. తలమీద పేను కొరకడం వల్ల అక్కడ వెంట్రుకలు మొత్తం పోయి, చిన్న చిన్న మచ్చల్లాగా, బట్టనెత్తి ఉన్నవారిలా తయారు అవుతుంది. దాని విరుగుడుకు నిమ్మరసం, వెల్లిపాయలు (4) తీసుకుని మెత్తగా నూరి పేస్టులాగా తయారు చేసుకుని, పేను కొరికిన చోట పూసి, ఒక అరగంట – గంట తర్వాత స్నానం చెయ్యాలి. ఇలా 3 రోజులు చేస్తే పేను కొరుకుడు ఉండదు, 10 రోజుల పాటు పేను కొరికిన చోట మర్దనా చేసినట్లయితే, మళ్ళీ వెంట్రుకలు కూడా మొలకెత్తుతాయి.

మొలలు (మూలశంక అని కూడా అంటారు) బాధతో చాలా మంది ఇబ్బది పడుతుంటారు. ఎక్కడా కాసేపు కూర్చోలేరు, నిలబడలేరు. అలాంటి వారు గోరింటాకును మెత్తగా నూరి, మలద్వారం వద్ద పెట్టి ఒక గోచీ కట్టుకుని రోజుకు గంట సేపు చొప్పున 5–6 రోజులు చేయగలిగినట్లయితే మొలల బాధ నుండి ఉపశమనం పొందవచ్చు. లేదా రాత్రిపూట గోరింటాకును పెట్టుకుని, గోచీ పెట్టుకుని, ఒక గుప్పెడు నువ్వులను గ్లాసులో వేసుకునిఒక వారం రోజుల పాటు త్రాగినట్లయితే మొలల బాధే ఉండదు.

ఇక మోకాళ్ళ నొప్పులతో బాధపడని గ్రామమంటూ దాదాపు ఉండదు. ఏ గ్రామానికి వెళ్ళినా సరే మనుషులు అడ్డంగా ఊగితూ నడుస్తూ ఉంటారు. ఏమైందంటే, మొకాళ్ళ నొప్పులు భరించలేకుండా ఉన్నాయి అంటూ బాధ పడుతుంటారు. ఎల్లిపాయల రెబ్బలు 5–6 తీసుకుని మెత్తగా నూరిన తర్వాత, కొద్దిగా నువ్వుల నూనె తీసుకుని, అందులో, దంచిన వెల్లుల్లి, ముద్ద హారతి కర్పూరం కొద్దిగా వేసి, పొయ్యిపైన వేడి చేస్తే కొద్దిసేపటికి అది పేస్టులాగా తయారవుతుంది. ఆ పేస్టును 10–15 రోజుల పాటు మోకాళ్ళు, నడుం నొప్పులు, మెడ నొప్పులు వున్నవారు తమకు నొప్పి వున్న చోట పూసి, ఒక గంట తర్వాత స్నానం చేస్తూ ఉంటే చాలు. లేదా రాత్రి పూసుకుని దానిపైన ఒక ప్లాస్టిక్ పేపరు పెట్టి, ఒక గుడ్డతో కట్టు కట్టుకుని ఉదయమే స్నానం చేసినా సరే. మొకాళ్ళ నొప్పులు నయమైపోయి, అక్కడ ప్రక్కకు జరిగిన గుజ్జు కూడా తన స్థానం లోకి వచ్చి, మొకాళ్ళు, నడుములు, మెడ నొప్పులు లేకుండా చేస్తుంది.

ప్రస్తుతం చలికాలం కాబట్టి చాలా మంది కాళ్ళు పగిలి చాలా బాధకు గురవుతుంటారు. వాటి నివారణకు కలబంద ఆకును కొద్దిగా తెచ్చుకుని, చిన్న చిన్న ముక్కలుగా చేసి, ఒక గిన్నెలో కొద్దిగా కొబ్బరి నూనె, కలబంద ముక్కలు వేసి, బాగా మరిగేలా వేడి చేసినట్లయితే, ఆ కలబంద లోని రసం మొత్తం నూనెలోకి చేరుకుంటుంది. ఆ నూనె చల్లారిన తర్వాత దాన్ని రాత్రిపూట కాళ్ళ పగుళ్ళ వద్ద బాగా మర్దనా చేసినట్లు పూసుకుని, ఉదయమే స్నానం చెయ్యాలి. ఇలా 10–15 రోజుల పాటు చేసినట్లయితే కాళ్ళ పగుళ్ళు నయమైపోతాయి.

మహిళలు గర్భసంచిలో గడ్డలు ఏర్పడటంతో చాలా బాధ పడుతూ ఉంటారు. వీటి నివారణకు కలబందను 3 అంగుళాల ముక్క తీసుకుని, దాని పైతోలు తీసివేస్తే లోపల తెల్లగా (నీటి రంగులో) కండ ఉంటుంది. ఆ కండను చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని, ఆ ముక్కలను రోజుకు రెండు మూడు చొప్పున పసుపులో అద్దుకుని రోజుకు ఒకసారి చొప్పున రెండు నెలల పాటు మింగినట్లయితే కడుపులో ఎంత లావు గడ్డ అయినా సరే ఇట్టే నయమై పోతుంది. కలబంద కడుపులోకి తీసుకున్నా ఎటువంటి దోషాలు (సైడ్ ఎఫెక్ట్) ఉండవు కాబట్టి, బయపడవలసిన అవసరం లేదు.

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854

# చలి కాలంలో ఆరోగ్యం కోసం కొన్ని చిట్కాలు



కొమెర అంకారావు

చలికాలంలో కొద్దిమందిలో 'కఫం' సమస్య చాలా వేధిస్తూ ఉంటుంది. అదేపనిగా దగ్గు రావటం, గొంతులో గళ్ళ రావటం లాంటి సమస్యలు వస్తుంటాయి. ఈ సమస్య నివారణకు 'కుంకుడు కాయ'లను మెత్తగా దంచి, అందులో కొద్దిగా నీరు పోసి, బాగా కలిపిన తర్వాత ఆ నీటి చుక్కలను ఒక్కో ముక్కు రంధ్రంలో రెండు చుక్కల చొప్పున వేస్తే కఫం సమస్య తీరిపోతుంది. ఇలా మూడు, నాలుగు రోజులు చేస్తే చాలు. లేదా ఒక చిన్న గరిట లేదా గిన్నెలో కొన్ని మిరియాలు వేసి, దాన్ని పొయ్యిపైన పెట్టినట్లయితే అవి బాగా కాగిన తర్వాత వాటినుండి పొగ వస్తుంది. ఆ పొగను ముక్కుతో, నోటితో బాగా పీల్చినట్లయితే కూడా కఫం సమస్య తీరిపోతుంది. దీనికే మరో వైద్యం 'గార పండు' (గరక్కాయ) తీసుకుని, అందులోని పైన వున్న చర్మం తీసిన తర్వాత మెత్తటి గుజ్జు లాంటి పదార్థాన్ని తీసుకుని, అందులో కొద్దిగా తేనె వేసుకుని నాకినట్లయితే కూడా కపం సమస్య నుండి బయట పడవచ్చు.

గొంతునొప్పి సమస్య కూడా చలికాలంలో తీవ్రంగా వస్తూ వుంటుంది. ఈ సమస్య నివారణకు నీటిలో కాస్త ఉప్పు వేసుకుని బాగా పుక్కిలిస్తూ, అప్పుడప్పుడూ గొంతులోని తిర్నాలిక దాకా నీళ్ళు వెళ్ళేలా పుక్కిలించిన తర్వాత నీటి ఉమ్మేయాలి. ఇలా రెండు మూడు రోజులు చేస్తే చాలు గొంతునొప్పి సమస్య తీరుతుంది. బీపీ ఉన్నవారు ఉప్పునీరు నోట్లో వేసుకోలేము అనుకున్న వారు 'దాల్చిన చెక్క'ను నోట్లో వేసుకుని బాగా మెత్తగా నమిలి, వచ్చిన రసాన్ని లో గొంతు దాకా వెళ్ళేలా చేస్తూ ఆ తర్వాత ఉమ్మివేస్తే గొంతునొప్పి సమస్య తీరుతుది. అలాగే మరో వైద్యం ఏమిటంటే, మిరియాలు కొన్ని తీసుకుని వాటిని దోరగా వేయించి, మెత్తటి పొడి చేసి పెట్టుకోవాలి. తరువాత ఆవు పాలు లేదా గేదె పాలు (ప్యాకెట్ పాలు వాడకుంటే మంచిది) బాగా వేడి చేసి, అందులో అర స్పూను మిరియాల పొడి, పావు స్పూను పసుపు వేసి కలుపుకుని రాత్రి పూట త్రాగినట్లయితే జలుబు, కఫం సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు.

చిన్న పిల్లలకు ఎక్కువగా, ఒక్కోసారి పెద్ద వారిని కూడా కడుపులో 'నులి పురుగు'ల సమస్య వస్తూ వుంటుంది. అటువంటి వారు 'శొంఠి'ని మెత్తటి పొడిగా చేసుకుని ప్రతి రోజూ, మూడు పూటలా తినేట పుడు ఆహారంలో ఒక చెంచాడు పొడి వేసుకుని తింటూ ఉన్నట్లయితే కడుపులో నులి పురుగుల బెడద నివారించ బడుతుంది.

కొంతమంది కడుపు ఉబ్బరంలో చాలా ఇబ్బందికి గురవుతుం టారు. కడుపేమో బిగుతుగా ఉంటుంది. ఆకలి అవుతుంది. కానీ, తిందామంటే తినబుద్ధి కాదు. అటువంటి వారు 'ధనియాలు' కొద్దిగా వేయించి, మెత్తటి పొడిగా చేసి, ఒక చెంచాడు పొడిని వేడి నీటిలో వేసుకుని తాగినట్లయితే కడుపు ఉబ్బరం సమస్య తీరిపోతుంది. ఇలా ఒకటి రెండు రోజులు చేస్తే చాలు. అలాగే రాతి ఉప్పు (దీన్నే సైంధవ లవణం అంటారు) పొడిలో కొద్దిగా అల్లం ముక్కను అద్దుకుని బాగా నమిలి రసాన్ని మింగుతూ ఉండాలి. ఈ చర్య అన్నం తినటానికి అరగంట ముందు చెస్తూ ఉండాలి. ఇలా 2-3 రోజులు చేస్తే చాలు కడుపు ఉబ్బరం సమస్య తీరిపోతుంది.



గారపండు

కొంతమంది శరీరం బడలికగా ఉంది, త్వరగా అలసి పోతున్నాను అనిపించినట్లయితే, అటువంటి వారు వ్యాయామం చేసేటపుడు లేదా యోగా చేసేటపుడు, ఇవన్నీ చేయలేని వారు అలా అలా నడుచుకుంటూ అన్నం వండిన తర్వాత వచ్చే గంజిని (అవసరమైతే కొద్దిగా ఉప్పు లేదా చక్కెర లేదా మిరియాల పొడి వేసుకోవచ్చు) కొద్ది కొద్దిగా సేవిస్తూ ఉన్నట్లయితే శరీరం బడలిక నుండి త్వరగా బైటకు వస్తుంది.

కడుపు నొప్పితో బాధ పడేవారు ఒక ఎర్రగడ్డ (ఉల్లిగడ్డ) తీసుకుని దాన్ని మంటలో బాగా కాల్చిన తర్వాత నల్లగా మారిన పై పొర తీసివేసి, మిగతా గడ్డను తిన్నట్లయితే కడుపు నొప్పి నుండి ఉపశమనం పొందవచ్చు. ఇలా 2-3 రోజులు చేస్తే చాలు.

శరీరంలో రక్త ప్రసరణ సరిగ్గా లేని వారు ఉదయం పూట గుప్పెడు తులసి ఆకులు తీసుకుని, వాటిని చేత్తోనే బాగా నలిపి ఒక గ్లాసు నీటిలో వేసి, ఆ నీటిని వేడి చేసుకుని, గోరువెచ్చగా మారిన తర్వాత త్రాగుతూ ఉన్నట్లయితే రక్త ప్రసరణ శరీరంలో బాగా జరిగుతుంది. నారింజ రసం రోజూ ఉదయం తీసుకున్నా సరే రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. అయితే జలుబు, కఫం వస్తుంది అనుకునే వారు నారింజ రసం కన్నా, తులసి రసం తీసుకోవటం ఉత్తమం. ఈ రెండూ కూడా తమ శరీరానికి పడవు అనుకునే వారు బీట్‌రూట్ రసాన్ని తయారు చేసుకుని తీసుకున్నా అదే ఫలితం ఉంటుంది.

కొందరు మహిళలు తమ నెలసరి దినాల్లో (బహిష్టు అయిన పుడు) చాలా ఇబ్బందులకు గురవుతూ ఉంటారు. అటువంటి వారు ఆ బహిష్టు అయిన రోజుల్లో నోట్లో 3-4 తమల పాకులు వేసుకుని నములుతూ వాటి రసాన్ని మింగుతూ ఉన్నట్లయితే ఆ సమస్యల నుండి విముక్తి పొందవచ్చు. తమలపాకులు నమల లేనివారు వాటి రసాన్ని తీసుకుని, త్రాగి తమ సమస్య నుండి బయట పడవచ్చు. ఆ మూడు రోజులూ మాంసాహారం, చేపలు లాంటి వాటికి దూరంగా ఉంటే మంచిది. ●




**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రవేం. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' కొమెర అంకారావు (జాజి), ఫోన్ : 9908411700

## పల్లెసృజన గేయం

పల్లె సృజనా.... పల్లె సృజనా....... ఓ పల్లె సృజనా.....
గ్రామాల్లోన మూలకు ఉన్న ఆవిష్కర్తలను .......
వెలికి తీసి.... జ్యోతి లాగా....
వెలిగించిన ఓ పల్లె సృజన.....
ఆవిష్కర్తల జీవితాల్లో...వెలుగులు నింపిన పల్లెసృజన...
నీకు యేమిచ్చి ఋణం తీర్చుకోము.... పల్లెసృజన....
చిన్న శోధ యాత్రలతో... పల్లెసృజన....
రైతులయొక్క అవసరాలనూ.....
గుర్తించితివి ఓ పల్లెసృజనా....
ఎక్కడో మారుమూల గ్రామంలో
ఉన్న నన్ను వెలికి తీసి ఓ పల్లెసృజన....
ఈ సమాజానికి పరిచయం చేసిన....ఓ పల్లెసృజన....
ఎంతోమంది ఆవిష్కర్తలకూ... పల్లెసృజన.....
నువ్వు అండగా నిలిచినావూ..... పల్లెసృజన....
ప్రభుత్వాలకు ఆవిష్కర్తలకు
నువ్వు వారధిగా నిలిచినావు..... పల్లెసృజన
ఎంతోమంది ఆవిష్కర్తలకు
ఎన్నో అవార్డులు ఇప్పిస్తుంటివి... పల్లెసృజన
నీకు ఎమిచ్చి రుణం తీర్చుకుందును పల్లెసృజన
నీకు నేను ఎంత చేసినా గాని చాలా తక్కువ పల్లెసృజన
నీకు శతకోటి వందనాలు..... ఓ పల్లెసృజన
ఓ పల్లెసృజన....... ఓ పల్లెసృజన

– రచన : **అంజయ్య, ఇన్నోవేటర్**

పంచ భూతములన్ ఋతు చక్రములన్
నలుదిక్కులను అక్కున చేర్చుకున్న
చక్కనైన పల్లెలను, పల్లెసృజన జనులను చూతము
పల్లెసృజనతోను మనమందరము జ్ఞానాన్వేషణ చేతము.
ఈ పుడమిపై భానుడి చంద్రారం స్నేహితులతో
రేయి పగలు మధ్య జరిగే సమన్వయమున
దాగిన అంతర్గత సమాచారం శోధించ వెళ్ళుదము
ఓ జనులారా మనసారా మీయొక్క సంవేదనతో
పల్లెల్లోని గ్రామస్తుల వద్దకు చేరుదాము.
ఓవైపు కోవెల జ్యోతి, ఓవైపు చితి జ్యోతి
మన జనన మరణముల మధ్యన
గలిగే సంఘర్షణ సమరమున
మీ పట్టుదలను విడవకుండ
మేథో మథనంబును చేయమంటూ
వచ్చే పల్లెసృజన సంవేదన అంతర్యమును
ఆకళింపును చేసుకొనుమా!
యావత్ జనమా!

మనసారా ఇవే మా సుమాంజలులు **- పవన్**, వాలంటీర్

జవాను మదిలో పుట్టింది
జనాలకోసం ఎదిగింది
జగాలు దాటి వెలిగింది
జయభేరి మ్రోగించింది
పల్లెపల్లెలో తిరిగింది
ప్రతిభను వెలికి తీసింది
పల్లె మట్టిలో మాణిక్యమిది
పట్టణాలకి స్ఫూర్తి పదమిది
పల్లెసృజన కొలనులో 'పద్మశ్రీ' పూసింది
పల్లెసృజన సిగలో అడవి 'జాజి' మెరిసింది
పల్లెతల్లి బాధనీ సంవేదన పొందింది
పల్లెతల్లి పాదాలకు పారాణి పూసింది.

– రచన : **హరీష్ ధర్మోజు,** పల్లెసృజన వాలంటీర్.

### 'పల్లెసృజన' గురించి ఒక ఇన్నోవేటర్ భావన

పల్లెసృజన మట్టి మనిషి మరో లోక అన్వేషణ
చెట్టు నీడలో జనియించే కొత్త సృష్టికి అంకురార్పణ
ఇంజనీర్ల గీత దాటి మరో లోక అన్వేషణ
చదువు రాని సంస్కరణలె పల్లెసృజన సమాలోచన
రైతన్న దుక్కి నుండి కమ్మరన్న కొలిమి నుండి
కాక పుట్టి కత్తులైన మట్టి మనిషి ఆలోచన....
చదువు లేదు... శాస్త్రీయ అదుపు లేదు...
చేతిలోన ముడుపు లేదు.... ఆకాశమే హద్దుగా.....
కడుపు కొరకు మట్టి మనిషి మరో లోక అన్వేషణ....
పల్లె జనుల చేతిలోన ప్రతిభ జ్వలితం....
పఠనలేని సృష్టి శక్తి ప్రస్ఫుటితం
ఈ సమైక్యతకు మర్గదర్శి మన గణేశం ....
పల్లె ప్రజల ప్రతిభకు ఆయన పట్టం.
మట్టి వాసనలో పుట్టే ఆలోచనలే
మహోన్నతం.... పల్లెసృజన పయనమే
భవిష్యత్ భారతం. **-చింతకాయల రాంబాబు,** ఇన్నోవేటర్












# పల్లెసృజన కొత్త రూపం "డిజిటల్ పల్లెసృజన పత్రిక"

2005వ సం. లో ప్రారంభమైన 'పల్లెసృజన' సంస్థ 2006లో 'పల్లెసృజన పత్రిక' మొదటి సంచిక వెలువరించింది. నాటి నుండి నేటి వరకు అంటే 20 సంవత్సరాలుగా ఈ పత్రిక నిర్వహణ కేవలం 'వాలంటీర్ల' సహకారంతో నడుస్తున్న పత్రిక అని గుర్తించాలి. ఈ 20 సంవత్సరాల ప్రయాణంలో సమాజానికి దాదాపు 300 మంది ఇన్నోవేటర్లను, 350కి పైగా ఇన్నోవేషన్లను మన తెలుగు ప్రజలకు పరిచయం చేయగలిగాము. ఈ ఇన్నోవేటర్లను, ఇన్నోవేషన్లను పరిచయం చేసే క్రమంలో, ప్రతి పత్రికలో ఇన్నోవేషన్ వివరాలతో పాటు, దాన్ని కనిపెట్టిన ఇన్నోవేటర్ పేరు, ఫోన్ నంబర్‌తో సహా ప్రచురించటం వలన పాఠకులు, ఇన్నోవేటర్ల మధ్య అనుసంధానం జరిగింది. వాస్తవంగా పల్లెసృజన కోరుకున్నది కూడా అదే. సమాజానికి పరిచయం కావలసింది 'జ్ఞానం' మరియు 'జ్ఞానకర్త'. ఈ రెండు విషయాలు ప్రజలకు చేరితే జ్ఞాన ప్రసరణ సమానాంతరంగా దానంతట అదే చేరుతుంది అని నమ్మింది పల్లెసృజన. పత్రికలో ప్రచురించిన కొద్ది కాలంలోనే ఎంతోమంది జ్ఞాన సంభాషణ ప్రారంభించారు. అంటే రైతు నుండి రైతుకు ఈ జ్ఞానం 'పల్లెసృజన' రాకముందు ఇటువంటి సంభాషణలు లేవు కాబట్టి జ్ఞాప ప్రసరణ జరగలేదు అని అర్థమైంది. ఇలా సమాచారం సమానాంతరంగా ప్రసరణ కావడం ద్వారా తమ అవసరాలకు తగిన 'జ్ఞానం' ఉన్న వారితో పంచుకోవడం వల్ల చాలా వరకు 'సమస్య'లకు పరిష్కారాలు లభించాయి. ఈ సంభాషణలు మొదలు కావడం వల్ల సమాజం బాగా లాభపడిందని విశ్వసిస్తోంది 'పల్లెసృజన'.

ఈ జ్ఞాన ప్రసరణ ఇలా కొనసాగుతున్న సమయంలోనే 'సాంకేతికత' (టెక్నాలజీ) అభివృద్ధి చెందడం మొదలైంది (ఇది 2015 ముందటి మాట). సమాజంలో దాదాపు ఎక్కువ శాతం మంది 'సెల్‌ఫోన్' వాడటం మొదలైంది. అందుకే 'పల్లెసృజన' సమాజ అభివృద్ధిని గమనిస్తూ, వారికి అనుకూలమైన మార్గంలోనే పల్లె జ్ఞానం అందజేయాలని ప్రత్యామ్నాయాలు వెతికింది. అందుకే ఇకనుండి రాబోయే 2026 కొత్త సంవత్సరం నుండి 'పల్లెసృజన' పత్రికను ముద్రణా రూపంలో కాకుండా "డిజిటల్" రూపంలో అందించాలని నిర్ణయించుకుంది.

ఈ నిర్ణయం వల్ల పత్రిక ఆగిపోతుందనే భావన అవసరం లేదు. పల్లె జ్ఞాన ప్రసరణ ఆగదు. ఆ జ్ఞానం మిమ్మల్ని చేరటం కూడా ఆగదు. పల్లెసృజన గతంలోలాగే పని చేస్తుంది, దాని కార్యక్రమాల్లోఎటువంటి మార్పు ఉండదు. కేవలం 'పత్రిక ముద్రణ' మాత్రమే ఆగిపోతుంది' అన్న విషయం పాఠకులు గమనించ గలరు. వచ్చే సంచిక నుండి పల్లెసృజన పత్రిక "డిజిటల్ పల్లెసృజన"గా మీ చేతిలో నేరుగా ఉంటుంది. పైగా ఈ పత్రిక మీకు డిజిటల్ రూపంలో రంగుల్లో వస్తుంది. అంటే మీరు చూడాలనుకున్న ఇన్నోవేషన్లు, ఇన్నోవేటర్లు ప్రత్యక్షంగా మీ ముందు ఉన్నట్లే డిజిటల్‌లో కనిపిస్తుంది. ఇప్పటి నుంచి పత్రికను మీరు చదవటమే కాదు, ఆ పత్రిక చదివిన తర్వాత అందులోని సమాచారాన్ని మీకు తెలిసిన వారికి అందిస్తే బావుంటుంది అనుకున్న క్షణంలోనే మీరా పత్రికను వారి ఫోన్‌కు 'వాట్స్ యాప్' లేదా 'ఇ-మెయిల్' ద్వారా క్షణాల్లో పంపవచ్చు. ఈ పద్ధతి వలన 'పల్లెసృజన' సమాజానికి ఇంకా విస్తృతంగా చేరుతుందని మా నమ్మకం. పాఠకులు పత్రికపై లేదా మీకు నచ్చిన వ్యాసంపై స్పందించాలి అనుకుంటే వాట్సాప్‌లోనే మీ స్పందన పంపితే తరవాత వచ్చే సంచికలో దాన్ని ప్రచురిస్తాం.

2026వ సంవత్సరం నుండి మీకు పత్రిక ముద్రణా రూపంలో కాకుండా 'డిజిటల్ పల్లెసృజన'గా మీకు చేరుతుంది. కాబట్టి 'పల్లెసృజన - పాఠకుల బంధం' ఎప్పటికీ ఆగిపోదు, ఆగిపోలేదు అని కూడా మీకు తెలియజేస్తున్నాము. ఏదైనా కారణాల వల్ల మీకు పల్లెసృజన డిజిటల్ పత్రిక మీ వాట్స్‌యాప్‌కు చేరకపోతే మీరు మా వెబ్‌సైట్ http://pallesrujana.org/ ను సందర్శించి పత్రికను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

- జమ్మలమడక శశిమోహన్, ఎడిటర్

వివరాల కొరకు సంప్రదించండి : బ్రిగేడియర్ పోగుల గణేశం, 9866 00 1678, పల్లె వీర రాఘవ రెడ్డి, 81257 99904 లను సంప్రదించ గలరు.

PALLE SRUJANA Telugu Bi-monthly November - December 2025 RNI No. TELTEL/ 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే**
















